# బలగం TV

BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ | మంగళవారం జూన్ 23 2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## చికాగోలో కాల్పుల ఘటనల్లో ఏడుగురు మృతి..

### 38 మందికి గాయాలు

### లిలినగరంలో మిలిటరీ మోహరింపుపై ట్రంప్ సంకేతాలులిలి

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

అమెరికాలోని చికాగో నగరం వరుస కాల్పుల ఘటనలతో వణికిపోయింది. శుక్రవారం నుంచి వివిధ ప్రాంతాల్లో చోటుచేసుకున్న కాల్పుల్లో ఏడుగురు మృతిచెందగా, మరో 38 మంది గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో జరిగిన హింసాత్మక ఘటనలు స్థానికులను భయాందోళనలకు గురిచేశాయి. అమెరికాలో మూడో అతిపెద్ద నగరంగా గుర్తింపు పొందిన చికాగోలో గత మూడు రోజులుగా 20కి పైగా ప్రాంతాల్లో కాల్పుల ఘటనలు నమోదయ్యాయి. వీటిలో కొన్ని సంఘటనలు సామూహిక కాల్పులుగా మారడం ఆందోళన కలిగిస్తోంది.

ఒక ప్రాంతంలో జరిగిన సామూహిక కాల్పుల్లో 12 మంది గాయపడినట్లు పోలీసులు తెలిపారు. ఓ ఎస్‌యూవీ వాహనంలో వచ్చిన వ్యక్తి జనసమ్మర్ధ ప్రాంతంలో విచక్షణారహితంగా కాల్పులు జరిపినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఘటన అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. మిగితా 2వ పేజీలో



# లక్నోలో ఘోర అగ్నిప్రమాదం..

## 14 మంది మృతి.. మోదీ దిగ్భ్రాంతి

**బలగం టీవీ, లక్నో**

ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో సోమవారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. అలీగంజ్‌లోని పురానియా ప్రాంతంలో ఉన్న ఓ మూడు అంతస్తుల భవనంలోని కోచింగ్ సెంటర్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించడంతో 14 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని కలిగించింది.

సమాచారం మేరకు, పురానియా ప్రాంతంలోని వాణిజ్య భవనంలో నిర్వహిస్తున్న కోచింగ్ సెంటర్‌లో మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే దట్టమైన పొగ భవనం అంతటా వ్యాపించడంతో విద్యార్థులు, సిబ్బంది తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రాణాలు కాపాడుకునేందుకు కొందరు పై అంతస్తుల నుంచి కిందకు దూకగా, మరికొందరు భవనంలోనే చిక్కుకుపోయారు.

అధికారుల సమాచారం ప్రకారం, మృతులంతా 20 నుంచి 24 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వారే. పలువురు తీవ్రంగా గాయపడగా, వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై ప్రధాని చ్ఞితీవఅనతీఖ వీశీసఱ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (ూవీచీక్ష్మఖీ) నుంచి మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయం ప్రకటించారు. ఘటన సమాచారం అందుకున్న వెంటనే ఉప ముఖ్యమంత్రి దీతీఖయవంష్ట్ర ూఖ్ష్ఠుఎ ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. అలాగే అలీగఢ్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి 'శీస్త్రఱ ాఎఅట్ఖుఅఫ్ష్త్ర తన పర్యటనను అర్థాంతరంగా రద్దు చేసుకుని లక్నోకు చేరుకున్నారు.

అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, విపత్తు నిర్వహణ బృందాలు సహాయక చర్యలను కొనసాగిస్తున్నాయి. భవనం గోడలను పగలగొట్టి లోపల చిక్కుకున్న వారిని రక్షించే ప్రయత్నాలు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనతో లక్నో నగరం విషాదంలో మునిగిపోయింది. కోచింగ్ సెంటర్లలో భద్రతా ప్రమాణాలపై మరోసారి చర్చ మొదలైంది.

# చర్చలు సానుకూలం

- కేంద్ర రైల్వే, సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి భేటీ
- హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణ, ఐఆర్ఎఫ్‌సీ రుణాల విడుదల తదితర అంశాలపై చర్చ



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కేంద్ర రైల్వే, సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో జరిగిన సమావేశం సానుకూల వాతావరణంలో సాగిందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. సోమవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రితో సమావేశమైన సీఎం, రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చలు జరిపారు. సమావేశం అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణ, ఐఆర్ఎఫ్‌సీ రుణాల విడుదల తదితర అంశాలపై కేంద్ర మంత్రితో విస్తృతంగా చర్చించినట్లు వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టుల విషయంలో కేంద్రం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

మంగళవారం కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో తాను, కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి కలిసి సమావేశం కానున్నట్లు సీఎం తెలిపారు. ఆ భేటీ అనంతరం హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టుపై స్పష్టత వచ్చే అవకాశం ఉందన్నారు. కాగా, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాసిన విషయం తెలిసిందే. రాష్ట్రానికి సంబంధించిన పలు పెండింగ్ అంశాలపై చర్చించేందుకు కేంద్ర మంత్రులతో సమావేశాలు ఏర్పాటు చేయాలని కోరగా, ఆ మేరకు కిషన్ రెడ్డి చొరవ తీసుకుని అశ్వినీ వైష్ణవ్‌తో భేటీని ఏర్పాటు చేసినట్లు సమాచారం.

రెండు గంటలకు పైగా కొనసాగిన ఈ సమావేశంలో మెట్రో ఫేజ్-2 పనులకు కేంద్ర సహకారం, ఆర్థిక వనరుల సమీకరణ, రుణాల విడుదల వంటి అంశాలపై ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలిసింది.

# ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టును అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేయాలి



కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కోరిన సీఎం రేవంత్ రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

భారత వాయుసేన ఆధ్వర్యంలో నిర్మించనున్న ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టును అన్ని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కోరారు. మంగళవారం ఢిల్లీలోని కర్తవ్య భవన్‌లో కేంద్ర మంత్రితో ముఖ్యమంత్రి సమావేశమై రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖకు చెందిన భూములను బదిలీ చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు అభివృద్ధి పనులకు అవసరమైన భూసేకరణ, యుటిలిటీల బదిలీ తదితర అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు. భారత వాయుసేన ఆధ్వర్యంలో అభివృద్ధి చెందనున్న ఈ విమానాశ్రయం దేశ రక్షణ, జాతీయ సమగ్రతకు సంబంధించిన కీలక ప్రాజెక్టు కావడంతో రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.

వాయుసేన టెర్మినల్‌తో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం పౌర విమానయాన శాఖ ఆధ్వర్యంలో నిర్మించనున్న టెర్మినల్ భవనం, కార్గో సదుపాయాలు, మెయింటెనెన్స్ రిపేర్ అండ్ ఓవర్‌హాల్ (ఎంఆర్‌వో), హ్యాంగర్‌ల ఏర్పాటుకు కేంద్రం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఇటీవల మధ్య ఆసియా ప్రాంతంలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో అంతర్జాతీయ విమానయాన సంస్థలు హ్యాంగర్‌ల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను అన్వేషిస్తున్నాయని, భౌగోళికంగా ఆదిలాబాద్ ఇందుకు అత్యంత అనుకూల ప్రాంతమని ముఖ్యమంత్రి వివరించారు. అదేవిధంగా, డీఆర్‌డీవో, డీఆర్‌డీఎల్ సంస్థలు మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీప ప్రాంతాన్ని తమ కీలక ప్రాజెక్టు కోసం ఎంపిక చేసిన నేపథ్యంలో ఆ ప్రాజెక్టుకు తక్షణమే ఆమోదం తెలపాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఖతార్‌లోని రాస్ లాఫాన్ ఎల్‌ఎన్‌జీ ప్లాంట్‌లో పేలుడు.

### 13 మంది మృతి




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఖతార్‌లోని ప్రపంచంలోనే అతిపెద్ద ఎల్‌ఎన్‌జీ (లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్) ప్రాసెసింగ్ కేంద్రాల్లో ఒకటైన రాస్ లాఫాన్ ఇండస్ట్రియల్ సిటీలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సోమవారం జరిగిన పేలుడులో కనీసం 13 మంది కార్మికులు మృతిచెందగా, పలువురు గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. ఖతార్ ప్రధాన ఎల్‌ఎన్‌జీ ప్రాసెసింగ్ కేంద్రంగా పేరుగాంచిన రాస్ లాఫాన్ గ్యాస్ కాంప్లెక్స్‌లో సాంకేతిక లోపం కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు ఆ దేశ ఇంధన శాఖ మంత్రి ాఖ్ఖుస ఖశ్రీ-ఖ్ఖుఎఱ తెలిపారు. ఈ ఘటనకు ఎలాంటి ఉగ్రదాడి లేదా విద్వేషపూరిత చర్యలతో సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు.

మంత్రి తెలిపిన వివరాల ప్రకారం, అత్యవసర నిర్వహణ పనుల కారణంగా 2025 డిసెంబర్ నుంచి ప్లాంట్ ఉత్పత్తి నిలిపివేయబడింది. రెండు రోజుల క్రితమే కార్యకలాపాలను పునఃప్రారంభించగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పేలుడులో మరణించిన వారంతా భారతదేశం, పాకిస్థాన్‌కు చెందిన కార్మికులేనని అధికారులు వెల్లడించారు. గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిపై ఇంకా పూర్తి సమాచారం బయటకు రాలేదు.

ఖతార్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రకారం, ఈ ఘటన వల్ల ఎలాంటి గ్యాస్ లీకేజీ సంభవించలేదని, ప్రజల భద్రతకు ఎలాంటి ముప్పు లేదని పేర్కొంది. ప్రమాదం జరిగిన వెంటనే అత్యవసర సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. రాజధాని దోహాకు సుమారు 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాస్ లాఫాన్ ఇండస్ట్రియల్ సిటీ ప్రపంచ ఎల్‌ఎన్‌జీ సరఫరాలో దాదాపు ఐదవ వంతు ఉత్పత్తి చేసే కీలక కేంద్రంగా గుర్తింపు పొందింది. ఈ ఘటనతో ప్రపంచ ఇంధన మార్కెట్ల దృష్టి ఖతార్‌పై పడినప్పటికీ, ఎల్‌ఎన్‌జీ ఎగుమతులపై ఎలాంటి ప్రభావం ఉండదని ఖతార్ ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే ఇటీవల మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు, ఇరాన్-అమెరికా-ఇజ్రాయెల్ ఘర్షణల నేపథ్యంలో ఈ పేలుడు చోటుచేసుకోవడం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. కాగా, ఘటనపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశాలు జారీ చేసినట్లు అధికారులు వెల్లడించారు.

# ప్రపంచానికి విశ్వసనీయ భాగస్వామిగా భారత్:



ప్రధాని మోదీ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

భారతదేశం కేవలం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ మాత్రమే కాదని, ప్రపంచానికి నమ్మకమైన భాగస్వామిగా, విశ్వసనీయ శక్తిగా ఎదుగుతోందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రపంచ సరఫరా గొలుసులు, సాంకేతిక రంగం, పెట్టుబడులు, వ్యూహాత్మక భాగస్వామ్యాల్లో భారత్‌పై అంతర్జాతీయ సమాజానికి విశ్వాసం పెరిగిందని ఆయన అన్నారు.

రిపబ్లిక్ మీడియా నెట్‌వర్క్ నిర్వహించిన 'రిపబ్లిక్ సమిట్-2026'లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రధాని, దేశ భవిష్యత్తు నిర్మాణంలో ప్రస్తుతం తీసుకుంటున్న నిర్ణయాలు కీలకమని స్పష్టం చేశారు.

**'వెయ్యేళ్ల భవిష్యత్తును నిర్మిస్తున్నాం'**

భారత్ తాత్కాలిక సంఘటనలకు స్పందించి భావోద్వేగాలకు లోనయ్యే దేశం కాదని ప్రధాని అన్నారు. వేల ఏళ్ల నాగరికత అనుభవం, విలువలు, సంస్కృతి భారతదేశానికి బలమని పేర్కొన్నారు. "నేడు భారత్ తీసుకుంటున్న ప్రతి నిర్ణయం, చేపడుతున్న ప్రతి కార్యక్రమం రాబోయే వెయ్యి సంవత్సరాల దేశ భవిష్యత్తును తీర్చిదిద్దుతోంది" అని మోదీ వ్యాఖ్యానించారు.


ఈ సందర్భంగా 'ధర్మం' గురించి కూడా ప్రధాని ప్రస్తావించారు. ధర్మం అంటే కేవలం మతపరమైన భావన కాదని, అది కర్తవ్యం, న్యాయం, సంభాషణ, కరుణ వంటి విలువల సమాహారమని వివరించారు. భారతదేశం తన శక్తిని ఇదే దృక్పథంతో ఉపయోగిస్తోందని చెప్పారు. ఇటీవల జరిగిన జీ-7 సమావేశాన్ని ప్రస్తావిస్తూ, ప్రపంచ దేశాలు నేడు భారతదేశ ప్రాధాన్యతను స్పష్టంగా గుర్తిస్తున్నాయని అన్నారు. 2014 నుంచి తమ ప్రభుత్వం 'నేషన్ ఫస్ట్' సూత్రంతోనే ముందుకు సాగుతోందని ప్రధాని పేర్కొన్నారు. దేశ అభివృద్ధిలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం కీలకమని, ప్రజల సహకారంతోనే ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతమవుతున్నాయని చెప్పారు.

రాజ్యాంగం పేరుతో పెద్ద పెద్ద మాటలు మాట్లాడే నాయకులు గతంలో నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల సమస్యలను పట్టించుకోలేదని ప్రధాని విమర్శించారు. ప్రజలు ప్రాణాలు కోల్పోయిన మిగితా 2వ పేజీలో

# సర్ షెడ్యూల్ విడుదల

### ప్రతి ఓటరికి ఎన్యుమరేషన్ తప్పనిసి

### అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా విడుదల




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)-2026 ప్రక్రియకు సంబంధించిన షెడ్యూల్‌ను జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ విడుదల చేశారు. అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. మే 26 నాటికి 22,09,647 మంది ఓటర్ల మ్యాపింగ్ పూర్తైందని, ఇది మొత్తం ఓటర్లలో 46.65 శాతమని తెలిపారు. మిగిలిన ఓటర్ల వివరాల సేకరణను వేగవంతంగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించనున్నారు. ఇంటికి తాళం వేసి ఉంటే కనీసం మూడు సార్లు సందర్శించి, అందుబాటులో లేకపోతే నోటీసు స్లిప్ అందజేస్తారు. సర్వే పూర్తైన ఇళ్లకు 'ఎన్యుమరేషన్ కంప్లీట్' స్టిక్కర్ అంటించనున్నారు. ఓటర్లు తమ వివరాలను నేరుగా బీఎల్‌వోలకు అందజేయడంతో పాటు ఆన్‌లైన్ ద్వారా కూడా సమర్పించుకోవచ్చని అధికారులు తెలిపారు. కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం-6, వివరాల సవరణల కోసం ఫారం-8 ఉపయోగించాలని సూచించారు.

హైదరాబాద్ జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 47,36,669 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. వీరిలో 23,99,880 మంది పురుషులు, 23,36,448 మంది మహిళలు, 341 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. జిల్లాలో మొత్తం 4,062 పోలింగ్ కేంద్రాలు, 1,684 పోలింగ్ లొకేషన్లు ఉన్నాయని తెలిపారు.

ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం వివిధ రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్లను నియమించాయని, మొత్తం 10,901 మంది బీఎల్ఏల నియామకం పూర్తైందని కర్ణన్ తెలిపారు.

**షెడ్యూల్ ఇలా..లిలి**

జూన్ 15 నుంచి 24 వరకు: శిక్షణ, సన్నాహక కార్యక్రమాలు
జూన్ 25 నుంచి జూలై 24 వరకు: ఇంటింటి సర్వే, ఎన్యుమరేషన్
జూలై 24: పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పూర్తి
జూలై 31: ముసాయిదా ఓటరు జాబితా విడుదల
జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు: క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ
సెప్టెంబర్ 28లోగా: అభ్యంతరాల పరిష్కారం
అక్టోబర్ 1: తుది ఓటరు జాబితా విడుదల

ఒక వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ నియోజకవర్గాలు లేదా పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు కలిగి ఉంటే ప్రజాప్రాతినిధ్య చట్టం-1950 ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఓటర్ల సందేహాల నివృత్తి కోసం ఈఆర్వో కార్యాలయాలు, డీఈవో కార్యాలయం, జీహెచ్ఎంసీ కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

# 'వచ్చే ఐదేళ్లు ఏదీ మర్చిపోం'..



బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ సమావేశంలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక నేతలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వారిని తాము మరచిపోమని స్పష్టం చేశారు. "వచ్చే ఐదేళ్లు ఏదీ మర్చిపోం. మనల్ని ఇబ్బంది పెట్టినోళ్లను మర్చిపోం. మనపై కేసులు పెట్టినోళ్లను మరిచిపోం. అదే సమయంలో మనతో నిలబడిన కార్యకర్తలను కూడా ఎప్పటికీ మరిచిపోం" అని అన్నారు. అలాగే తన రాజకీయ శైలిపై కూడా కేటీఆర్ వ్యాఖ్యానిస్తూ, "నేను కేసీఆర్ సార్‌లా అంత మంచోడిని కాదు" అని అన్నారు. కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వారిపై రాజకీయంగా పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. "ఎవరు మా కార్యకర్తలను సతాయించారో వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. ఎక్కడ ఉన్నా వెతికి తీసుకొచ్చి ప్రజల ముందుంచే బాధ్యత నాది" అని కేటీఆర్ పేర్కొన్నారు. అయితే ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ప్రత్యర్థి నేతలపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన కేటీఆర్, భవిష్యత్ రాజకీయ పరిణామాలపై కూడా సంకేతాలు ఇచ్చినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ, "తర్వాత వాళ్లు మంచివాళ్లే అని మళ్లీ పార్టీలోకి తీసుకురావద్దు" అని సరదాగా వ్యాఖ్యానించారు. ఈ సమావేశం ద్వారా వర్ధన్నపేట నియోజకవర్గంలో పార్టీ శ్రేణులను సమీకరించడంతో పాటు, రానున్న రాజకీయ పోరాటాలకు కార్యకర్తలను సిద్ధం చేయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ నాయకత్వం కనిపించింది.

# టీఎంసీ చైర్‌పర్సన్ పదవి నుంచి మమత ఔట్

### అరూప్ రాయ్‌కు బాధ్యతలు..

### అభిషేక్‌కు షాక్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తృణమూల్ కాంగ్రెస్‌లో అంతర్గత సంక్షోభం మరింత ముదిరింది. పార్టీ వ్యవస్థాపకురాలు, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నాయకత్వాన్ని సవాలు చేస్తున్న తిరుగుబాటు వర్గం సోమవారం కీలక నిర్ణయాలు తీసుకుంది. పార్టీ చైర్‌పర్సన్ పదవి నుంచి మమతా బెనర్జీని తప్పించి, ఆ స్థానంలో సీనియర్ ఎమ్మెల్యే అరూప్ రాయ్‌ను నియమించినట్లు తిరుగుబాటు నేత రితబ్రత బెనర్జీ ప్రకటించారు.

ఇప్పటివరకు శాసనసభ, పార్లమెంటరీ వ్యవహారాలకే పరిమితమైన విభేదాలు ఇప్పుడు పార్టీ సంస్థాగత వ్యవస్థలోనూ స్పష్టంగా కనిపిస్తున్నాయి. తమదే అసలైన తృణమూల్ కాంగ్రెస్ అని ప్రకటిస్తున్న తిరుగుబాటు వర్గం, సమాంతర పార్టీ నిర్మాణాన్ని ఏర్పాటు చేస్తూ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ క్రమంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు కూడా రితబ్రత బెనర్జీ వెల్లడించారు. పార్టీ రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ ప్రస్తుత నాయకత్వం వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. పార్టీ కౌన్సిలర్లు, తిరుగుబాటు ఎమ్మెల్యేలతో జరిగిన సమావేశం అనంతరం ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అరూప్ రాయ్ కూడా పాల్గొన్నారు. పార్టీలో నెలకొన్న రాజ్యాంగపరమైన సంక్షోభాన్ని పరిష్కరించేందుకు ఈ సమావేశం నిర్వహించినట్లు తిరుగుబాటు వర్గం పేర్కొంది. పార్టీ నియమావళి ప్రకారం ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి జాతీయ కార్యవర్గాన్ని పునర్వ్యవస్థీకరించాల్సి ఉంటుందని, అయితే 2022 ఫిబ్రవరిలో ఏర్పాటైన కమిటీ గడువు ముగిసినా కొత్త కమిటీని ఏర్పాటు చేయలేదని రితబ్రత ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో పార్టీని కాపాడేందుకు ప్రత్యామ్నాయ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి వచ్చిందని ఆయన తెలిపారు. మరోవైపు తిరుగుబాటు వర్గం తీసుకున్న ఈ నిర్ణయాలపై మమతా బెనర్జీ వర్గం ఇంకా అధికారికంగా స్పందించలేదు. అయితే తాజా పరిణామాలు పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి.

# బ్రిటన్ ప్రధాని పదవికి స్టార్మర్ రాజీనామా

### లేబర్ పార్టీలో ఒత్తిడికి తలొగ్గిన కీర్ స్టార్మర్

### కొత్త నాయకుడి ఎంపికకు రంగం సిద్ధం

మిగితా 2వ పేజీలో

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ప్రకటించారు. సొంత పార్టీ లేబర్

# అమెరికా ఆంక్షల సడలింపు

**ఇరాన్ చమురు ఎగుమతులకు 60 రోజుల తాత్కాలిక అనుమతి**

**శాంతి చర్చల్లో పురోగతితో కీలక నిర్ణయం**

**బలగం టీవీ, హైదరాబాద్**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించి శాంతి పునరుద్ధరణకు జరుగుతున్న దౌత్య ప్రయత్నాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్‌తో కొనసాగుతున్న చర్చల్లో సానుకూల సంకేతాలు కనిపిస్తున్న నేపథ్యంలో అమెరికా ప్రభుత్వం ఇరాన్ చమురు ఎగుమతులపై అమలులో ఉన్న కొన్ని ఆంక్షలను తాత్కాలికంగా సడలించింది. అమెరికా ఆర్థిక శాఖ 60 రోజుల గడువుతో ప్రత్యేక జనరల్ లైసెన్స్ జారీ చేసినట్లు ప్రకటించింది. ఈ లైసెన్స్ కింద ఇరాన్ నుంచి ముడి చమురు, పెట్రోకెమికల్ ఉత్పత్తులు, ఇతర పెట్రోలియం ఉత్పత్తుల ఉత్పత్తి, రవాణా, విక్రయం, దిగుమతులకు పరిమిత అనుమతులు కల్పించింది.

**స్విట్జర్లాండ్‌లో చర్చలు**

స్విట్జర్లాండ్ వేదికగా అమెరికా, ఇరాన్ ప్రతినిధుల మధ్య జరిగిన చర్చల్లో పురోగతి నమోదైనట్లు సమాచారం. ఈ చర్చల్లో హర్మూజ్ జలసంధిలో నౌకాయానానికి ఎలాంటి ఆటంకాలు కల్పించబోమని ఇరాన్ హామీ ఇచ్చినట్లు అమెరికా వర్గాలు వెల్లడించాయి. అంతర్జాతీయ అణుశక్తి సంస్థ తనిఖీలకు కూడా ఇరాన్ అంగీకరించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అమెరికా అధికారులు పేర్కొన్నారు.

**చమురు మార్కెట్లకు ఊరట**

ఈ నిర్ణయంతో ప్రపంచ ఇంధన మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితి కొంతవరకు తగ్గే అవకాశముందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. హర్మూజ్ జలసంధి ద్వారా చమురు రవాణా సాధారణ స్థితికి వస్తే అంతర్జాతీయ మార్కెట్లలో సరఫరా మెరుగుపడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇరాన్ నుంచి చమురు దిగుమతి చేసుకునే దేశాలకు ఈ నిర్ణయం తాత్కాలిక ఉపశమనంగా మారనుంది.



**వీటికి అనుమతి**

కొత్త లైసెన్స్ ప్రకారం ఇరాన్ నుంచి ముడి చమురు ఉత్పత్తి, విక్రయం, ఎగుమతి, రవాణా, లోడింగ్, దిగుమతులకు సంబంధించిన లావాదేవీలకు అనుమతులు లభించాయి. అలాగే నౌకా రవాణా, బీమా, ఆర్థిక చెల్లింపులు వంటి అనుబంధ సేవలకూ మినహాయింపులు వర్తిస్తాయి.

అవసరమైతే ఇరాన్ ముడి చమురును అమెరికాలోకి దిగుమతి చేసుకునే అవకాశాన్ని కూడా ఈ లైసెన్స్ కల్పించినట్లు పేర్కొన్నారు.

**శాశ్వత ఒప్పందంపై ఆశలు**

అమెరికా–ఇరాన్ మధ్య తాత్కాలిక అవగాహన భవిష్యత్తులో సమగ్ర ఒప్పందానికి దారి తీసే అవకాశముందని అమెరికా అధికారులు అభిప్రాయపడ్డారు. రాబోయే 60 రోజుల్లో ఇరు దేశాల మధ్య మరిన్ని చర్చలు జరగనున్నాయి. అయితే ఈ మినహాయింపులు ఇతర ఆంక్షల పరిధిలో ఉన్న కొన్ని దేశాలకు వర్తించవని అమెరికా ప్రభుత్వం స్పష్టం చేసింది.

# ప్రపంచానికి విశ్వసనీయ భాగస్వామిగా భారత్

(మొదటి పేజీ తరువాయి)

సందర్భాల్లో కూడా కాంగ్రెస్ నాయకత్వం మౌనంగా వ్యవహరించిందని ఆరోపించారు. భద్రతతో పాటు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు వల్ల నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులు గణనీయంగా మారాయని తెలిపారు.

ఒకప్పుడు బాంబులు, తుపాకుల సంస్కృతికి కేంద్రంగా ఉన్న బస్తర్ ప్రాంతం ఇప్పుడు క్రీడలకు కేంద్రంగా మారిందని మోదీ చెప్పారు. బస్తర్ ఒలింపిక్స్‌లో లక్షలాది మంది యువత పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలు పెరగడం అసంతృప్తికి సంకేతం కాదని, ప్రభుత్వంపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు.

"మోదీజీ ఇది చేయాలి, అది చేయాలి అని కాంగ్రెస్ పార్టీ కూడా చెబుతోంది. ఎందుకంటే ఎవరు చేస్తారని నమ్మకం ఉంటే వారినే ప్రజలు ఆశ్రయిస్తారు" అంటూ ప్రధాని కాంగ్రెస్‌పై వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. సమిట్‌లో పాల్గొన్న జోహో వ్యవస్థాపకుడు శ్రీధర్ వేంబును ప్రధాని ప్రత్యేకంగా అభినందించారు. 'నేషన్ ఫస్ట్' భావనతో పనిచేసే పారిశ్రామికవేత్తలు దేశ అభివృద్ధికి తోడ్పడతారని అన్నారు. ఫ్రాన్స్‌లో జరిగిన వివాటెక్ ప్రదర్శనలో జోహోకు లభించిన ఆదరణను గుర్తుచేస్తూ, భారత సంస్థలు ప్రపంచ వేదికలపై గుర్తింపు పొందడం దేశ ఆవిష్కరణ శక్తికి నిదర్శనమని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# బ్రిటన్ ప్రధాని పదవికి స్టార్మర్ రాజీనామా

**లేబర్ పార్టీలో ఒత్తిడికి తలొగ్గిన కీర్ స్టార్మర్**

**కొత్త నాయకుడి ఎంపికకు రంగం సిద్ధం**



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ప్రకటించారు. సొంత పార్టీ లేబర్ నుంచి పెరుగుతున్న ఒత్తిడి, నాయకత్వంపై అసంతృప్తి నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. దేశ ప్రయోజనాలకే ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇచ్చానని, అదే దృష్టితోనే పదవి నుంచి తప్పుకుంటున్నానని స్టార్మర్ పేర్కొన్నారు.

63 ఏండ్ల స్టార్మర్ రాజీనామాతో గత పదేళ్లలో బ్రిటన్‌లో పదవి నుంచి వైదొలిగిన ఆరో ప్రధానమంత్రిగా నిలిచారు. కొత్త నాయకుడి ఎంపిక ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని లేబర్ పార్టీ పాలక మండళ్లను కోరనున్నట్లు ఆయన తెలిపారు.

**పార్టీలో తగ్గిన మద్దతు**

తన నాయకత్వానికి పార్టీలో మద్దతు తగ్గిపోయిందని స్టార్మర్ స్వయంగా అంగీకరించారు. గత కొంతకాలంగా వివిధ విధాన నిర్ణయాలు, రాజకీయ వివాదాలు, ప్రజాదరణ క్షీణత కారణంగా ఆయన తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. 2024 ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్న విమర్శలు ప్రతిపక్షాల నుంచే కాకుండా సొంత పార్టీ నేతల నుంచీ వ్యక్తమయ్యాయి. జీవన ప్రమాణాల మెరుగుదల, ద్రవ్యోల్బణ నియంత్రణ, ప్రజా సంక్షేమ అంశాల్లో ప్రభుత్వం ఆశించిన ఫలితాలు సాధించలేకపోయిందనే అసంతృప్తి లేబర్ పార్టీలో పెరిగినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. స్టార్మర్ రాజీనామాతో గత పదేళ్లలో బ్రిటన్ ఏడో ప్రధానమంత్రిని చూడబోతోంది. తరచూ నాయకత్వ మార్పులు చోటుచేసుకోవడం బ్రిటన్ రాజకీయాల్లో అస్థిరతకు సంకేతంగా విశ్లేషకులు పేర్కొంటున్నారు. స్టార్మర్ వారసుడి ఎంపికపై ఇప్పటికే చర్చలు ప్రారంభమయ్యాయి. గ్రేటర్ మాంచెస్టర్ మాజీ మేయర్ ఆండీ బర్న్‌హామ్ ప్రధానమంత్రి పదవికి ప్రధాన పోటీదారుగా ఎదుగుతున్నట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఇటీవల జరిగిన ఉప ఎన్నికలో విజయం సాధించి పార్లమెంట్‌కు తిరిగి వచ్చిన బర్న్‌హామ్, లేబర్ పార్టీలో ప్రత్యామ్నాయ నాయకత్వంగా గుర్తింపు పొందారు. 'కింగ్ ఆఫ్ ది నార్త్'గా పేరుగాంచిన ఆయనకు పార్టీ శ్రేణులు, మద్దతుదారుల నుంచి ఆదరణ పెరుగుతోంది. అయితే కొత్త నాయకుడి ఎంపికపై లేబర్ పార్టీ అధికారిక ప్రక్రియ ప్రారంభం కానుండగా, బ్రిటన్ రాజకీయాల్లో తదుపరి పరిణామాలు ఆసక్తికరంగా మారాయి.

# ప్రజలను మోసం చేసిన ప్రభుత్వం



**వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయం**

**బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు**

**బలగం టీవి, హైదరాబాద్**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఆయన, రాష్ట్ర ప్రభుత్వం రైతులు, పేదలు, యువతను మోసం చేసిందని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చెప్పిన మాటలు, ఎన్నికల హామీలు, ప్రజా సభల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు కాలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోలేకపోయారని, ఆయన పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని పేర్కొన్నారు.

**రైతుభరోసా, బోనస్‌పై విమర్శలు**

రైతుభరోసా నిధులను పూర్తిగా చెల్లించకుండా రైతులను ఇబ్బందులకు గురిచేశారని హరీశ్‌రావు ఆరోపించారు. వడ్లకు బోనస్ ఇస్తామని ప్రకటించి తరువాత మాట మార్చారని విమర్శించారు. చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ప్రస్తుతం కేంద్రం ఎంత కొనుగోలు చేస్తే అంతే కొనుగోలు చేస్తామని చెప్పడం రైతులను ఆందోళనకు గురిచేస్తోందన్నారు. రాష్ట్ర ఖజానాలో నిధులు లేవని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ భారీ వ్యయాలతో నిర్మాణాలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. రైతులకు ఆర్థిక సహాయం, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించలేని ప్రభుత్వం ఇతర కార్యక్రమాలపై ఖర్చు చేస్తోందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు మళ్లీ అవకాశం ఇస్తారని హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వందకు పైగా స్థానాల్లో విజయం సాధిస్తామని, ఉమ్మడి పాలమూరు జిల్లాలో పార్టీ బలంగా నిలుస్తుందని అన్నారు. ప్రజలు మళ్లీ సంక్షేమ పాలన కోరుకుంటున్నారని పేర్కొన్నారు.

రవాణా పన్నులు, రిజిస్ట్రేషన్ చార్జీలు, ఇంధన ధరల పెంపుపై కూడా హరీశ్‌రావు విమర్శలు చేశారు. ప్రజలపై ఆర్థిక భారం పెరుగుతోందని, ప్రభుత్వం ఆదాయ వనరుల కోసం ప్రజలపై అదనపు భారం మోపుతోందని అన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తలు కష్టకాలంలోనూ పార్టీకి అండగా నిలుస్తున్నారని, ప్రతి కార్యకర్తను పార్టీ కాపాడుకుంటుందని నాయకులు పేర్కొన్నారు. ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియలో పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని నాయకత్వం సూచించింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:**

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి నిర్వహిస్తున్నామని కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించి.. ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించి.. పరిష్కారానికి ఆదేశించారు. మొత్తం 159 అర్జీలు రాగా, సంబంధిత అధికారులకు అందజేశారు.

**సద్వినియోగం చేసుకోవాలి**

జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం తోపాటు సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రజలు తమ అర్జీలు అందించాలని సూచించారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖితారెడ్డి, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.

# చికాగోలో కాల్పుల ఘటనల్లో ఏడుగురు మృతి..

(మొదటి పేజీ తరువాయి)

నగరంలో పెరుగుతున్న హింసాత్మక ఘటనల నేపథ్యంలో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. చికాగోలో పరిస్థితులు అదుపు తప్పుతున్నాయని, అవసరమైతే నగరంలో మిలిటరీని మోహరించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సంకేతాలు ఇచ్చారు. తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో ట్రంప్ స్పందిస్తూ.. "చికాగోను మళ్లీ సురక్షిత నగరంగా మారుస్తాం" అని పేర్కొన్నారు. నగరంలో శాంతిభద్రతల పరిస్థితిపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు, కాల్పుల ఘటనలపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పలు ప్రాంతాల్లో అదనపు భద్రతా బలగాలను మోహరించారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. చికాగోలో వరుసగా చోటుచేసుకుంటున్న కాల్పుల ఘటనలు అమెరికాలో గన్ హింసపై మరోసారి తీవ్ర చర్చకు దారితీశాయి.



# ధాన్యం కుంభకోణంపై ప్రత్యేక విచారణ జరపాలి...

**-సివిల్ సప్లైస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు.**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో వరి ధాన్యం కుంభకోణంపై సమగ్ర దర్యాప్తు జరిపి, దోషులను కఠినంగా శిక్షించాలంటూ జిల్లా ఉద్యమకారుడు మరవేణి రంజిత్ కుమార్ సివిల్ సప్లైస్ మరియు డైరెక్టర్ జనరల్ ఆఫ్ విజిలెన్స్ ఢ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఎల్లారెడ్డిపేట కిషన్ దాస్ పేట పోస్ట్ ఆఫీస్ ద్వారా ఫిర్యాదు చేశారు.?ఈ అక్రమాలు కేవలం కొందరు వ్యక్తులకు మాత్రమే పరిమితమైనవి కావని, గత అనేక సంవత్సరాలుగా జిల్లాలో ఇదే తరహా దోపిడీ కొనసాగుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని రంజిత్ కుమార్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కొంతమంది అధికారులు, రైస్ మిల్లర్లు, మరియు కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు కుమ్మక్కై రైతులకు అన్యాయం చేయడమే కాకుండా, ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొడుతున్నారని తీవ్రంగా ఆరోపించారు.?ఈ మొత్తం వ్యవహారంపై ఒక ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేసి, లోతైన దర్యాప్తు నిర్వహించాల్సిన అవసరం ఉందని కోరారు. కేవలం బయటపడిన అంశాలకే పరిమితం కాకుండా, సంబంధిత అధికారులు మరియు రైస్ మిల్లర్ల ఆస్తులపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కొనుగోలు చేసిన మొత్తం ధాన్యం, మిల్లింగ్‌కు తరలించిన పరిమాణం, ప్రభుత్వానికి అప్పగించిన బియ్యం మరియు ప్రస్తుతం నిల్వ ఉన్న ధాన్యం వివరాలను బహిరంగపరచాలని, ఆన్‌లైన్ ఎంట్రీలు మరియు రికార్డుల్లో ఉన్న వ్యత్యాసాలను గుర్తించి బాధ్యులను నిర్ధారించాలని కోరారు.

?అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, రైతులకు మరియు ప్రభుత్వానికి జరిగిన నష్టాన్ని బాధ్యుల నుండి రికవరీ చేయాలని రంజిత్ కుమార్ విజ్ఞప్తి చేశారు. విచారణ పారదర్శకంగా సాగాలంటే, దర్యాప్తు పూర్తయ్యే వరకు అనుమానిత అధికారులు మరియు ఇన్‌చార్జిలను విధుల్లోంచి తొలగించాలని డిమాండ్ చేశారు. రైతుల చెమటతో పండిన ధాన్యం విషయంలో జరిగిన ఈ అక్రమాలపై విజిలెన్స్ ఢ ఎన్‌ఫోర్స్‌మెంట్ మరియు సివిల్ సప్లైస్ శాఖలు సంయుక్తంగా స్పందించి, వాస్తవాలను వెలికితీయాలని కోరారు.

# హామీల అమలులో ప్రభుత్వం విఫలం..




**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

పట్టణాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ఎండ, వాన, చలిని సైతం లెక్కచేయకుండా పనిచేస్తున్న తమ పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి గుర్రం అశోక్, అన్నారు.

?రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సిరిసిల్ల మరియు వేములవాడ మున్సిపల్ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం భారీ నిరసన తెలిపారు . ఈ సందర్భంగా జిల్లా పరిపాలనా అధికారికి తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా

మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి గుర్రం అశోక్, సిఐటియు జిల్లా కార్యదర్శి కోడం రమణ మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ. 26,000 చెల్లిస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని, ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారని, అయితే రెండేళ్ల సమయం గడిచినా ఆ హామీలు అమలు కావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం కార్మికులను తీవ్ర శ్రమ దోపిడీకి గురిచేస్తోందని ఆరోపించారు.

?మున్సిపాలిటీలలో పని భారం విపరీతంగా పెరిగిపోయిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. మరణించిన కార్మికుల స్థానంలో గానీ, 60 ఏళ్లు దాటిన వారి స్థానంలో గానీ వారి కుటుంబ సభ్యులను విధుల్లోకి తీసుకోవడం లేదని, దీనివల్ల ఉన్న కార్మికులపైనే పని భారం పెరుగుతోందని పేర్కొన్నారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల పరిధిలో 2009 నుండి 2012 వరకు పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ బకాయిలను ఇప్పటివరకు చెల్లించలేదని, సరైన ఈఎస్ఐ కార్డులు, ఐడెంటిటీ కార్డులు మరియు రక్షణ పరికరాలు కూడా అందించడం లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేస్తున్న ఆదేశాలను స్థానిక అధికారులు అమలు చేయడంలో విఫలమవుతున్నారని విమర్శించారు.

?ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తాము లేవనెత్తిన సమస్యలను పరిష్కరించాలని, లేని పక్షంలో రానున్న రోజుల్లో నిరవధిక సమ్మెకు దిగుతామని కార్మిక సంఘం నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎగమంటి ఎల్లారెడ్డి, జిల్లా నాయకులు అన్నల్దాస్ గణేష్, సూరం పద్మ, ఎలిగేటి రాజశేఖర్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కాసారపు శంకర్, సిరిసిల్ల మున్సిపల్ అధ్యక్షులు ఏల్పుల బాలయ్య, వేములవాడ మున్సిపల్ కార్యదర్శి దొబ్బల లచ్చయ్యతో పాటు సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రామాలయ నిధులపై సుప్రీంకోర్టులో పిటిషన్

**సీబీఐ విచారణకు ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి**

**పిల్‌లను తిరస్కరించిన అలహాబాద్ హైకోర్టు**

**బలగం టీవీ, హైదరాబాద్**

అయోధ్య రామాలయానికి వచ్చిన విరాళాలు, నిధుల వినియోగంలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో సుప్రీంకోర్టులో సోమవారం పిటిషన్ దాఖలైంది. రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆర్థిక వ్యవహారాలు, పరిపాలనలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అవకతవకలపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)తో విచారణ జరిపించాలని పిటిషన్‌లో కోరారు. విరాళాల సేకరణ, నిధుల వినియోగం, పరిపాలనా వ్యవహారాల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి సమగ్ర దర్యాప్తు చేపట్టాలని సుప్రీంకోర్టును పిటిషనర్ అభ్యర్థించారు.

రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, పరిపాలనా నిర్ణయాలు, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై స్వతంత్ర సంస్థతో దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందని పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చిన విరాళాల వినియోగంపై పూర్తి పారదర్శకత ఉండాలని కూడా కోరారు. ఇదిలా ఉండగా, విరాళాలకు సంబంధించిన అవకతవకలపై అత్యవసర విచారణ జరపాలని కోరుతూ దాఖలైన రెండు ప్రజాప్రయోజన వ్యాజ్యాలను అలహాబాద్ హైకోర్టు తిరస్కరించింది. ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసిన నేపథ్యంలో ప్రస్తుతం అత్యవసర జోక్యం అవసరం లేదని హైకోర్టు అభిప్రాయపడింది. సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌పై విచారణ ఎప్పుడు చేపడతారన్న అంశంపై ఆసక్తి నెలకొంది. రామాలయ నిధుల వినియోగానికి సంబంధించిన ఆరోపణలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో అత్యున్నత న్యాయస్థానం స్పందనకు ప్రాధాన్యత ఏర్పడింది.

# ఇంగ్లాండ్ టూర్‌కు టీమిండియా వన్డే జట్టు ప్రకటన

**బలగం టీవీ, హైదరాబాద్**

ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లే భారత వన్డే జట్టును బీసీసీఐ ప్రకటించింది. సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలకు జట్టులో స్థానం కల్పించింది. అయితే ఇటీవల అఫ్గానిస్థాన్‌తో జరిగిన మూడో వన్డేలో సెంచరీతో ఆకట్టుకున్న యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్‌కు మాత్రం చోటు దక్కలేదు. వేగవంతమైన బౌలర్ హర్షిత్ రాణా తిరిగి జట్టులోకి వచ్చాడు. జట్టు వివరాలను బీసీసీఐ సెలక్షన్ కమిటీ ఛైర్మన్ అజిత్ అగార్కర్ వెల్లడించారు. శుభ్‌మన్ గిల్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించగా, శ్రేయస్ అయ్యర్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించారు. విరాట్ కోహ్లీ ఫిట్‌నెస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తేనే జట్టులో ఆడే అవకాశం ఉంటుంది.

**ఇంగ్లాండ్ పర్యటనకు భారత వన్డే జట్టు**

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ (ఫిట్‌నెస్‌కు లోబడి), శ్రేయస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), కేఎల్ రాహుల్, ఇషాన్ కిషన్, వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, నితీశ్‌కుమార్ రెడ్డి, కుల్‌దీప్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, బ్రార్.

**ఐర్లాండ్ పర్యటనకు భారత జట్టు**

ఐర్లాండ్ పర్యటనకు వెళ్లే భారత జట్టుకు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వహించనున్నారు.

**ఐర్లాండ్ టూర్ జట్టు**

శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), శివమ్ దూబే, అభిషేక్ శర్మ, నితీశ్‌కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, వైభవ్ సూర్యవంశీ, ప్రసిద్ధ్ కృష్ణ. యశస్వీ జైస్వాల్‌కు చోటు దక్కకపోవడం ఎంపికల్లో ప్రధాన చర్చనీయాంశంగా మారగా, అనుభవజ్ఞులైన ఆటగాళ్లపై సెలెక్టర్లు మరోసారి విశ్వాసం వ్యక్తం చేశారు.

# రైల్వే నిబంధనల ఉల్లంఘనపై భారీ జరిమానాలు

**జూలై 1 నుంచి కొత్త నిబంధనలు అమలు**

**టికెట్ లేకుండా ప్రయాణిస్తే రూ.500 జరిమానా**

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రయాణికులకు భారతీయ రైల్వే షాక్ ఇచ్చింది. రైల్వే నిబంధనలను ఉల్లంఘించే వారిపై విధించే జరిమానాలను భారీగా పెంచుతూ కొత్త నిబంధనలను తీసుకొచ్చింది. సవరించిన జరిమానా నిబంధనలు జూలై 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ మేరకు రైల్వే మంత్రిత్వ శాఖ అన్ని జోనల్ రైల్వేలకు ఆదేశాలు జారీ చేసింది.

రైళ్లలో టికెట్ లేకుండా ప్రయాణించే ప్రయాణికులపై ప్రస్తుతం ఉన్న రూ.250 జరిమానాను రూ.500కు పెంచారు. అదనంగా ప్రయాణించిన దూరానికి సంబంధించిన పూర్తి చార్జీని కూడా వసూలు చేయనున్నారు. ఇతరుల పేరుతో బుక్ చేసిన టికెట్‌తో ప్రయాణిస్తే టికెట్‌ను స్వాధీనం చేసుకుని పూర్తి చార్జీతో పాటు రూ.500 జరిమానా విధిస్తారు.

మహిళలకు కేటాయించిన బోగీల్లో అనధికారికంగా ప్రయాణించే వారిపై గరిష్ఠంగా రూ.2,500 వరకు జరిమానా విధించనున్నారు. జరిమానా చెల్లించకపోతే కేసును కోర్టుకు పంపిస్తారు. కోర్టు ఆదేశాల మేరకు జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా విధించే అవకాశం ఉంది.

రైళ్లలో లేదా రైల్వే స్టేషన్లలో అనుమతి లేకుండా వస్తువులు విక్రయించడం, వీధి వ్యాపారం చేయడం, ప్రయాణికులను కొనుగోళ్ల కోసం ఇబ్బంది పెట్టడం వంటి చర్యలపై కూడా కఠిన నిబంధనలు అమలు చేయనున్నారు. ఇలాంటి వారిపై రూ.2 వేల వరకు జరిమానా విధించనున్నారు. జరిమానా చెల్లించకపోతే కోర్టు ద్వారా మూడు నెలల వరకు జైలు శిక్ష లేదా రూ.5 వేల వరకు జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంది. పునరావృతంగా నేరాలకు పాల్పడితే ఏడాది వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

రైళ్లు, రైల్వే స్టేషన్లలో మద్యం సేవించి ప్రయాణికులను వేధించడం, దుర్భాషలాడడం లేదా గొడవలు సృష్టించే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోనున్నారు. అలాంటి వ్యక్తులను రైలు నుంచి దించివేసి జరిమానాలు విధించడంతో పాటు చట్టపరమైన చర్యలు చేపట్టనున్నారు. ఈ కొత్త నిబంధనలను జూలై 1 నుంచి దేశవ్యాప్తంగా అమలు చేయనున్నట్లు రైల్వే శాఖ వెల్లడించింది. టికెట్ లేకుండా ప్రయాణించడం, టికెట్ దుర్వినియోగాన్ని అరికట్టడం, రైళ్లలో క్రమశిక్షణను పెంపొందించడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని రైల్వే బోర్డు పేర్కొంది. అన్ని జోనల్ రైల్వేలు సిబ్బందికి ఈ నిబంధనలపై అవగాహన కల్పించి కఠినంగా అమలు చేయాలని ఆదేశించింది.

# అశోక్‌నగర్‌లో నిరుద్యోగ జేఏసీ ధర్నా

హైదరాబాద్, జూన్ 23: అధికారంలోకి వస్తే భారీ ఎత్తున ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ చేపడతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, రెండున్నరేళ్లు గడిచినా కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయడం లేదని నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగాల భర్తీపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో అశోక్‌నగర్ కూడలి వద్ద ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా నిరుద్యోగులు మాట్లాడుతూ.. గ్రూప్-1లోని ఎంపీడీవో పోస్టులను ఉద్యోగోన్నతుల ద్వారా కాకుండా నేరుగా నియామకాల ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీతో పాటు ఎస్సై, కానిస్టేబుల్ పోస్టులకు సంబంధించి వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేయాలని కోరారు.



# భగీరథ్ బెయిల్‌పై సీఎం, కేంద్ర మంత్రిపై ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శలు

**బలగం టీవీ, హైదరాబాద్**

పోక్సో కేసులో నిందితుడైన భగీరథ్‌కు మంజూరైన తాత్కాలిక బెయిల్ వెనుక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరోక్ష హస్తం ఉందని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ మధ్య జరిగిన రాజకీయ కుమ్మక్కు కారణంగానే బాధిత బాలికకు అన్యాయం జరుగుతోందని విమర్శించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భగీరథ్‌కు మంజూరైన బెయిల్ ఆర్డర్ కాపీని బాధిత కుటుంబానికి అందించకపోవడంపై ప్రశ్నలు లేవనెత్తారు.

పోక్సో కేసు నమోదు అయి నెలన్నర దాటినా ఇప్పటివరకు చార్జ్‌షీట్ దాఖలు చేయకపోవడంపై ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కేసులో మరికొందరిపై చర్యలు తీసుకోవాల్సి వస్తుందనే ఉద్దేశంతోనే దర్యాప్తులో జాప్యం జరుగుతోందని అనుమానం వ్యక్తం చేశారు. కేసు విచారణ సందర్భంగా నిందితుడి గత చరిత్రను కోర్టు ముందు ప్రస్తావించడంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ విఫలమయ్యారని ఆరోపిస్తూ, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**జైలులోనే పరీక్ష రాసే అవకాశం ఉందని వ్యాఖ్య**

భగీరథ్‌కు తాత్కాలిక బెయిల్ మంజూరు చేయడానికి పరీక్షలను కారణంగా చూపడాన్ని ఆర్ఎస్పీ ప్రశ్నించారు. చర్లపల్లి జైలులోనే పరీక్షలు రాసే సౌకర్యం కల్పించవచ్చని, అవసరమైతే కోర్టు అనుమతితో పరీక్షా కేంద్రానికి తీసుకెళ్లి తిరిగి జైలుకు తరలించే అవకాశం కూడా ఉందని పేర్కొన్నారు. జూన్ 20తో ప్రత్యేక సప్లిమెంటరీ పరీక్షలు ముగిసినప్పటికీ, జూన్ 22 నుంచి 26 వరకు మరోసారి ప్రత్యేక పరీక్షలు నిర్వహించడంపై అనుమానాలు వ్యక్తం చేశారు.

పోక్సో కేసులో బాధిత బాలికకు పూర్తి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హామీ ఇచ్చారు. కేసు పురోగతి వివరాలను బాధిత కుటుంబానికి తెలియజేయాల్సిన చట్టబద్ధ బాధ్యతలను అధికారులు పాటించడం లేదని విమర్శించారు.

కేంద్ర మంత్రి కుమారుడిపై పోక్సో కేసు నమోదైనప్పటికీ బీజేపీ అధిష్ఠానం స్పందించకపోవడాన్ని ఆయన ప్రశ్నించారు. గతంలో అవినీతి ఆరోపణలపై పార్టీ నేతలపై చర్యలు తీసుకున్న బీజేపీ, ఇప్పుడు ఎందుకు మౌనం పాటిస్తోందని నిలదీశారు. భగీరథ్ బెయిల్ వ్యవహారంలో పారదర్శకత పాటించలేదని, కేసుకు సంబంధించిన అన్ని అంశాలను వెలుగులోకి తీసుకురావాలని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు.

# ప్రపంచంలోనే అతిపెద్ద స్క్రీనింగ్ కార్యక్రమం అమలు

**బసవతారకం ఆస్పత్రి రజతోత్సవాల్లో కేంద్ర మంత్రి అనుప్రియ పటేల్**

**బలగం టీవీ, హైదరాబాద్**




హైదరాబాద్, జూన్ 23: దేశంలో క్యాన్సర్ వ్యాధిపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర యుద్ధం ప్రకటించిందని, ప్రపంచంలోనే అతిపెద్ద క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ రజతోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

దేశవ్యాప్తంగా 1.84 లక్షల ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల ద్వారా 30 ఏళ్లు దాటిన వారికి ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమం కింద ఇప్పటివరకు 35 కోట్ల మందికి నోటి క్యాన్సర్, 16 కోట్ల మంది మహిళలకు రొమ్ము క్యాన్సర్, 9 కోట్ల మందికి సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించినట్లు తెలిపారు.

ముందస్తుగా వ్యాధిని గుర్తించడం ద్వారా ప్రాణాలను కాపాడటంతో పాటు చికిత్స వ్యయాన్ని కూడా తగ్గించవచ్చని అనుప్రియ పటేల్ పేర్కొన్నారు.

**వైద్య మౌలిక సదుపాయాల విస్తరణ**

దేశంలో క్యాన్సర్ చికిత్సకు అవసరమైన వైద్య మౌలిక సదుపాయాలను కేంద్ర ప్రభుత్వం విస్తరించిందని ఆమె తెలిపారు. 2014కు ముందు 384గా ఉన్న మెడికల్ కాలేజీల సంఖ్య ప్రస్తుతం 820కి పెరిగిందని చెప్పారు.

ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన కింద 62 కోట్ల మంది పేదలకు క్యాన్సర్ చికిత్సలో ఆర్థిక భద్రత కల్పిస్తున్నామని వెల్లడించారు. జన్ ఔషధి కేంద్రాల ద్వారా తక్కువ ధరలకు మందులు అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు.

**హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఉచితం**

క్యాన్సర్ నివారణ చర్యల్లో భాగంగా 14 ఏళ్ల బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను ఉచితంగా అందిస్తున్నట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. అవగాహన, ముందస్తు నిర్ధారణ, సమయానికి చికిత్స అనే మూడు అంశాలే క్యాన్సర్ నియంత్రణలో కీలకమని ఆమె అన్నారు.

**బసవతారకం ఆస్పత్రి సేవలు అభినందనీయం**

స్వర్గీయ ఎన్టీఆర్ దార్శనికత, బసవతారకం స్ఫూర్తితో ఏర్పడిన ఈ ఆస్పత్రి గత 25 ఏళ్లుగా పేదలకు నాణ్యమైన వైద్య సేవలను అందిస్తోందని అనుప్రియ పటేల్ కొనియాడారు. ఆస్పత్రి చైర్మన్ నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో సంస్థ విశేష సేవలు అందిస్తోందని ప్రశంసించారు. అమరావతిలో ఏర్పాటు చేయనున్న కొత్త క్యాన్సర్ ఆస్పత్రికి ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, వైద్య నిపుణులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# తెలంగాణలో మళ్లీ వర్షాల జోరు

**జూన్ 23 నుంచి 28 వరకు పలు జిల్లాలకు భారీ వర్ష సూచన**

**ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులపై వాతావరణ శాఖ హెచ్చరిక**

**బలగం టీవీ, హైదరాబాద్**

ఎండలు, ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న తెలంగాణ ప్రజలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) చల్లటి కబురు చెప్పింది. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు మళ్లీ చురుగ్గా మారుతున్న నేపథ్యంలో జూన్ 23 నుంచి 28 వరకు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని హెచ్చరించింది.

**ఉత్తర తెలంగాణలో మొదట వానలు**

జూన్ 23న జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. జూన్ 24న ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, మెదక్, కామారెడ్డి జిల్లాలకు భారీ వర్ష సూచనలు జారీ చేశారు.

**జూన్ 25న మరిన్ని జిల్లాలకు విస్తరణ**

జూన్ 25న ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశముందని తెలిపారు.

**హైదరాబాద్‌కు కూడా భారీ వర్ష సూచన**

జూన్ 26న వర్షాల ప్రభావం హైదరాబాద్‌తో పాటు దక్షిణ, మధ్య తెలంగాణ జిల్లాలకు విస్తరించే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

జూన్ 27, 28 తేదీల్లో కూడా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కొనసాగే అవకాశముందని సాధారణ హెచ్చరిక జారీ చేసింది.

**తగ్గనున్న ఉష్ణోగ్రతలు**

ఇటీవలి రోజులుగా నమోదవుతున్న ఎండలు, ఉక్కపోత నుంచి ప్రజలకు కొంత ఉపశమనం లభించే అవకాశం ఉంది. రాబోయే ఐదు రోజుల్లో రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 5 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. చాలా ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 36 నుంచి 40 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉంది.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

ఉరుములు, మెరుపులు, ఈదురుగాలుల నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు. చెట్ల కింద నిలబడకుండా, విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగల సమీపానికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. రైతులు కూడా వాతావరణ పరిస్థితులను గమనిస్తూ వ్యవసాయ పనులు చేపట్టాలని సూచించారు.

# వర్షాకాలానికి ఆర్అండ్‌బీ శాఖ అప్రమత్తం

**ఫీల్డ్ సిబ్బందికి సెలవులపై ఆంక్షలు**

**వరదల నివారణకు ప్రత్యేక ఎస్ఓపీ విడుదల**

**బలగం టీవీ, హైదరాబాద్**

వర్షాకాలంలో వరదల ముప్పు నేపథ్యంలో రోడ్లు, వంతెనలు, కల్వర్టులు తదితర మౌలిక సదుపాయాల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఫీల్డ్ సిబ్బందికి ప్రత్యేక అనుమతి లేకుండా ఎలాంటి సెలవులు మంజూరు చేయవద్దని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు రోడ్లు-భవనాల శాఖ ప్రత్యేక స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ)ను రూపొందించి అమల్లోకి తీసుకొచ్చినట్లు మంత్రి తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రహదారి రవాణా వ్యవస్థను నిరంతరం కొనసాగించడం, వరదల వల్ల కలిగే నష్టాన్ని తగ్గించడం, అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించడం ఈ ఎస్ఓపీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

**అధికారులంతా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలి**

జూన్ నుంచి అక్టోబర్ వరకు వర్షాకాలం ముగిసే వరకు సూపరింటెండింగ్ ఇంజినీర్ నుంచి అసిస్టెంట్ ఇంజినీర్ వరకు అన్ని స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని మంత్రి ఆదేశించారు. ప్రత్యేక అనుమతి లేకుండా ఫీల్డ్ సిబ్బందికి సెలవులు మంజూరు చేయరాదని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జేసీబీలు, ఎక్స్కవేటర్లు, టిప్పర్లు, డీ-వాటరింగ్ పంపులు, ఇసుక సంచులు, కంకర, తారు, ఆర్‌సీసీ సామగ్రి, హెచ్‌డీపీఈ పైపులు తదితర అవసరమైన పరికరాలు, సామగ్రిని ముందుగానే సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాలు, ముంపు ప్రమాదం ఉన్న రహదారులు, వంతెనలు, కల్వర్టులు, బలహీన ప్రాంతాలను ముందుగానే గుర్తించి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రమాదకర ప్రాంతాలకు ప్రత్యామ్నాయ మార్గాలను గుర్తించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

భారత వాతావరణ శాఖ (ఐఎండీ), తెలంగాణ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ, డిజాస్టర్ పోర్టల్ జారీ చేసే హెచ్చరికలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. పోలీసు, రెవెన్యూ, సాగునీటి, విద్యుత్ శాఖలతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని సూచించారు.

**24 గంటల్లో నష్టం అంచనా**

భారీ వర్షాలు, వరదల కారణంగా రహదారులు దెబ్బతిన్న వెంటనే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ మార్గాలను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. వరద నీరు తగ్గిన వెంటనే తాత్కాలిక పునరుద్ధరణ పనులు ప్రారంభించాలని సూచించారు.

నష్టం జరిగిన 24 గంటల్లోపు ఫోటోలు, జీపీఎస్ వివరాలతో నష్టం అంచనా నివేదికలు సమర్పించాలని తెలిపారు. ప్రజల ప్రాణ భద్రతకు సంబంధించిన పనుల్లో ఎలాంటి ఆలస్యం జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఇంజినీర్లకు సూచించారు.

**రంగుల వారీగా హెచ్చరికలు**

వర్షపాతం తీవ్రత ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా గ్రీన్, ఎల్లో, ఆరెంజ్, రెడ్ అలర్ట్ వ్యవస్థను అమలు చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

గ్రీన్ అలర్ట్: 64.5 మి.మీ.లోపు వర్షపాతం

ఎల్లో అలర్ట్: 64.5 నుంచి 115 మి.మీ.

ఆరెంజ్ అలర్ట్: 115 నుంచి 204 మి.మీ.

రెడ్ అలర్ట్: 204 మి.మీ.లకు పైగా వర్షపాతం

రెడ్ అలర్ట్ సమయంలో ఏఈలు, ఏఈఈలు, ఈఈలు 24 గంటలపాటు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి సహాయక చర్యలను పర్యవేక్షించాలని మంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఆర్అండ్‌బీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు ప్రతిరోజూ పరిస్థితుల నివేదికలు పంపాలని, నష్టం జరగకపోయినా 'నిల్ రిపోర్ట్' సమర్పించాలని ఆదేశించారు.

# భువనగిరి కోటకు పూర్వ వైభవం

**రోప్‌వే, హోటల్, ఆధునిక సదుపాయాలతో**

**ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి**

**అక్టోబర్ 2 నాటికి పనులు పూర్తి చేయాలని**

**ఆదేశం: మంత్రి జూపల్లి**

**బలగం టీవీ, హైదరాబాద్**



ఏకశిలపై నిర్మితమైన చారిత్రక భువనగిరి కోటకు పూర్వ వైభవాన్ని తీసుకొచ్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. రోప్‌వే, హోటల్, ఆధునిక మౌలిక సదుపాయాలతో భువనగిరి కోటను ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. సోమవారం భువనగిరి కోట అభివృద్ధి పనులు, రోప్‌వే నిర్మాణ పనులను మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, కాంట్రాక్టర్ సంస్థ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించి పనుల పురోగతిని పరిశీలించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న పనుల్లో జాప్యం చోటుచేసుకోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

కొండ అడుగు భాగంలో రోప్‌వే స్టేషన్, హోటల్, పార్కింగ్, విశ్రాంతి గదులు, చిన్నారుల ఆట స్థలం, రాక్ గార్డెన్ విద్యుద్దీపాల అలంకరణ పనులు చేపడుతున్నారు. కొండపై భాగంలో కోట పునరుద్ధరణ, జలవనరుల సుందరీకరణ, కేఫెటేరియా, ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్, మెట్ల పునరుద్ధరణ, ఎంట్రన్స్ ప్లాజా, టికెట్ కౌంటర్, వెయిటింగ్ లాంజ్, రెస్టారెంట్ తదితర సదుపాయాలను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు వివరించారు.

**యాదాద్రి--భువనగిరి--కొలనుపాక టూరిజం సర్క్యూట్**

యాదాద్రి, భువనగిరి కోట, కొలనుపాకలను అనుసంధానిస్తూ ఆధ్యాత్మిక, వారసత్వ పర్యాటక సర్క్యూట్‌ను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. స్వదేశ్ దర్శన్ 2.0 పథకం కింద రూ.56.81 కోట్ల వ్యయంతో భువనగిరి కోటను అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు.

అదనంగా రూ.17.91 కోట్లతో రోప్‌వే నిర్మాణం చేపడుతున్నామని, దీనివల్ల పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అక్టోబర్ 2 నాటికి అన్ని పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

**పర్యాటక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వాలు పర్యాటక రంగాన్ని నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. కొత్త పర్యాటక విధానం ద్వారా రాష్ట్రంలోని పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేస్తూ ఉపాధి అవకాశాలు, ఆదాయ వనరులు పెంచడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

2047 నాటికి తెలంగాణను అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక, వారసత్వ, సాంస్కృతిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. దేశ, విదేశీ పర్యాటకులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

**ఫణిగిరి బౌద్ధ క్షేత్రం సందర్శన**

భువనగిరి పర్యటన అనంతరం మంత్రి సూర్యాపేట జిల్లా నాగారం మండలంలోని ఫణిగిరి బౌద్ధ క్షేత్రం, మ్యూజియాన్ని సందర్శించారు. బౌద్ధ వారసత్వ సంపద పరిరక్షణ, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ గౌతమి, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, పురావస్తు శాఖ డైరెక్టర్ డాక్టర్ అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

# జనగణన మొదటి దశలో జిల్లాకు మొదటి స్థానం..



-జిల్లా కలెక్టర్ కు అధికారుల శుభాకాంక్షలు

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

జనగణన -2027 లో భాగంగా మొదటి దశ ప్రక్రియ విజయవంతంగా నిర్వహించి.. రాజన్న సిరిసిల్ల జిల్లా రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలవడంతో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ కు అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు.జనగణన-2027లో భాగంగా నిర్వహించిన తొలి దశ గృహ జాబితా, గృహాల లెక్కింపు కార్యక్రమం 2026 మే 11న ప్రారంభమై జూన్ 9వ తేదీన ముగియగా,రాష్ట్రస్థాయిలో కచ్చితత్వ వివరాల నమోదు, ప్రక్రియ సరిగా పూర్తి చేయడం సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం డిస్ట్రిక్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ రాజన్న సిరిసిల్ల (డోర్స్) తరపున జిల్లా అధికారులు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందజేసి.. శుభాకాంక్షలు తెలియజేశారు.జిల్లా కలెక్టర్ ను కలిసిన వారిలో డోర్స్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అఫ్జల్ బేగం, సీపీఓ శ్రీనివాసాచారి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకి రూ.26,000 కనీస వేతనం చెల్లించాలి..

## -కలెక్టర్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన




బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల

ప్రభుత్వ ఆసుపత్రులు మరియు మెడికల్ కాలేజీలలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న శానిటేషన్, స్వీపర్స్, మరియు సెక్యూరిటీ గార్డుల సమస్యల పరిష్కారం కోసం సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ము.శం.రమేష్, యూనియన్ అధ్యక్షులు శ్రీరామ్, సదానందం మాట్లాడుతూ, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనం రూ. 26,000/- ఉండాలని డిమాండ్ చేశారు. జీవో నెం. 60 ప్రకారం రూ. 15,600/- వేతనం చెల్లించాలని స్పష్టమైన ఉత్తర్వులు ఉన్నప్పటికీ, ప్రస్తుతం కార్మికులకు కేవలం రూ. 11,000/- మాత్రమే అందుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలిన మొత్తాన్ని పీఎఫ్, ఈఎస్ఐ పేరుతో కాంట్రాక్టర్లు కటింగ్ చేస్తూ కార్మికులను దోచుకుంటున్నారని మండిపడ్డారు.

గత 20, 30 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు కూడా సకాలంలో అందకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నేతలు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని డైరెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నా సందర్భంగా జూన్ నెల నుండి వేతనాలు పెంచుతామని ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ, నేటికీ ఉత్తర్వులు విడుదల చేయకపోవడంతో కార్మికులలో తీవ్ర అసంతృప్తి నెలకొందని అన్నారు.ఈ క్రమంలోనే రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహిస్తున్నామని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే జులై మొదటి వారం నుండి నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు.

కార్మికులు తమ ప్రధాన డిమాండ్లుగా రూ. 26,000/- వేతనం ఇవ్వాలని, పీఎఫ్ మరియు ఈఎస్ఐ యజమాని వాటాను ప్రభుత్వమే భరించాలని, శ్రమదోపిడీకి కారణమవుతున్న ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వమే నేరుగా వేతనాలు చెల్లించాలని కోరారు. వీటితో పాటు ఉద్యోగ భద్రత కల్పించడం, కాంట్రాక్టర్ల వేధింపులను అరికట్టడం, ప్రమాద బీమా సౌకర్యం, గ్రాట్యుటీ అమలు, వార్షిక సెలవులు, మరియు ఆసుపత్రులలో యూనిఫాం, భోజనశాల, విశ్రాంతి గదుల వంటి కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎగమంటే ఎల్లారెడ్డి, కోడం రమణ, అన్నల్దాస్ గణేష్, సూరం పద్మ, ఎలిగేటి రాజశేఖర్, సుజాత, పద్మ, లతా, రజిత, గోపాల్, కాళిదాసు, రమేష్, విజయ్, వెంకటేష్, శ్రీకాంత్, నాగరాజు, రాధా, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలి..

## -జిల్లా కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆందోళన





బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని, ప్రైవేట్ మరియు కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించే ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు శనిగారపు రజనీకాంత్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, విద్యా సంవత్సరం ప్రారంభమై ఇన్ని రోజులు గడుస్తున్నా, ప్రభుత్వం ప్రకటించిన హామీ మేరకు విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పూర్తిస్థాయిలో అందజేయడంలో విఫలమైందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలులో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందని, నిత్యావసర ధరల పెరుగుదలకు అనుగుణంగా నిధులు కేటాయించకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. స్వచ్ఛంద సంస్థల ద్వారా అందిస్తున్న భోజనం నాణ్యతపై వస్తున్న ఫిర్యాదులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

ప్రైవేట్ మరియు కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను పూర్తిగా వ్యాపారంగా మార్చాయని, నర్సరీ స్థాయి నుంచే లక్షల రూపాయల ఫీజులను వసూలు చేస్తూ తల్లిదండ్రులపై పెనుభారం మోపుతున్నాయని అన్నారు. పాఠశాలల పేరిట పుస్తకాలు, యూనిఫాంలు, షూలు, సాక్సులు వంటి వస్తువులను అధిక ధరలకు బలవంతంగా అంటగడుతున్నారని, దీనిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఫీజుల నియంత్రణ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని కోరారు.

?రాష్ట్రంలోని 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకు కుదించే ప్రతిపాదనలు విద్యా వ్యవస్థకే ప్రమాదకరమని, ఇటువంటి నిర్ణయాలను ప్రభుత్వం విరమించుకోవాలని అన్నారు . పాఠశాలల సంఖ్యను తగ్గించకుండా, జనాభా ప్రాతిపదికన కొత్త పాఠశాలలను ఏర్పాటు చేస్తూ ఉన్నవాటిని బలోపేతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, జిల్లా కమిటీ సభ్యులు కడారి శివ, ముబారక్, విద్యార్థి నాయకులు స్నేహిత, ఆఫియా, ఆదిత్య, వరుణ్, అనీష్, జస్వంత్, అక్షయ్, వినీత్, హరిచరణ్, వివేక్, మణిదీప్, రీషి కుమార్, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం అక్రమాలపై నిగ్గుతేల్చాలి..




-నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

-టిఆర్ఎస్ జిల్లా ఇంచార్జ్ మజీద్

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

రాజన్న సిరిసిల్ల జిల్లాలో రైతులు ఎంతో కష్టపడి పండించి, కొనుగోలు కేంద్రాలకు తరలించిన వరి ధాన్యం విషయంలో సుమారు 5 నుండి 6 కోట్ల రూపాయల భారీ కుంభకోణం జరిగిందని, దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) జిల్లా ఇంచార్జ్ మజీద్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మజీద్ మాట్లాడుతూ, ఈ వ్యవహారంలో కీలక రాజకీయ నాయకులు, సంబంధిత అధికారుల హస్తం ఉందని జిల్లా ప్రజలు చర్చించుకుంటున్నారని పేర్కొన్నారు.

?ధాన్యం అక్రమ రవాణాపై స్పందించి, ఆరుగురిని అరెస్టు చేసి 14.16 లక్షల నగదును స్వాధీనం చేసుకోవడంతో పాటు, బ్యాంకుల్లో ఉన్న 46.21 లక్షలను సీజ్ చేసిన పోలీస్ శాఖ పనితీరును అభినందనీయమని అన్నారు . కొనుగోలు కేంద్రాల నిర్వహణ, తూకం, ట్రాక్ షీట్ల జారీ, ఆన్‌లైన్ అప్‌డేట్ వంటి అత్యంత పకడ్బందీ ప్రక్రియలు ఉన్నప్పటికీ ఇంతటి భారీ స్కాం జరగడం, ఈ అక్రమాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

?త్వరలో టిఆర్ఎస్ అధినేత కవితక్క ముఖ్యమంత్రి కావడం ఖాయమని, ఆమె ప్రవేశపెట్టనున్న 'పాంచ జన్యశీ' పథకాల ద్వారా ఉచిత విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టాక, రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక గదులను ఏర్పాటు చేసి, ప్రత్యేక సిబ్బందిని నియమిస్తామని కవితక్క ఇచ్చిన హామీని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కుంభకోణంలో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరినీ గుర్తించి కఠినంగా శిక్షించాలని, ఈ విషయంలో వెనకడుగు వేయవద్దని ఉన్నతాధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కదిరే భాస్కర్, సయ్యద్ జావిద్, ఓర్సు అశోక్, బైరి రాజేష్, సయ్యద్ మౌలా, తోట కనకయ్య, అంతర్పుల బాబు, బండి శ్రీహరి, మండేపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.



# హాస్టల్, విద్యాలయం ఆవరణ పరిశుభ్రంగా ఉండాలి..

## - కలెక్టర్ గరిమ అగ్రవాల్

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల

మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. తంగళ్ళపల్లిలోని సిరిసిల్ల తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల విద్యాలయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా డైనింగ్ హాల్ కి వెళ్లి విద్యార్థులు భోజనం చేస్తుండగా వారితో మాట్లాడారు. ఈరోజు ఏ ఏ ఆహార పదార్థాలు వడ్డించారో ఆరా తీశారు. మెనూ చార్ట్ పరిశీలించి.. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కిచెన్ గోదాంలో బియ్యం, పప్పులు ఇతర ఆహార పదార్థాలను నాణ్యతను పరిశీలించారు. ఎంతమంది విద్యార్థులు వచ్చారో ఆరా తీశారు. అనంతరం వసతి గదులను, టాయిలెట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. విద్యార్థులందరూ తరగతులకు హాజరయ్యేలా చూడాలని సూచించారు. విద్యాలయాల ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు.

# ధాన్యం అక్రమ తరలింపు కేసులో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి తొలగింపు

## -పూర్తిస్థాయి విచారణకు అదనపు కలెక్టర్‌ను కలెక్టర్ ఆదేశాలు

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

ప్రభుత్వ ధాన్యం అక్రమ తరలింపు కేసులో నిందితుడు అయిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని సోమవారం తొలగించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల యాసంగి సీజన్ ధాన్యం సేకరణ పూర్తి చేయగా, ధాన్యం అక్రమ తరలింపు కేసులో జిల్లా పౌర సరఫరాల శాఖలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి కే. రాజ శేఖర్ ను పోలీసులు అరెస్ట్ చేశారు.ఈ కేసులో నిందితుడిగా ఉన్న రాజ శేఖర్ ను వెంటనే విధుల నుంచి తొలగిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.అలాగే ధాన్యం అక్రమ తరలింపు పై పూర్తి స్థాయిలో విచారణ చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. విచారణ నివేదిక రాగానే .. తదుపరి చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.



# విద్య,క్రీడలు,సృజనాత్మక కార్యకలాపాలపై దృష్టి సారించాలి..

## - సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి.

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

విద్యార్థులు డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ విద్య, క్రీడలు, సాంస్కృతిక మరియు సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించి తమ లక్ష్యాలను సాధించాలని సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి సూచించారు.సిరిసిల్ల పట్టణంలోని గీతానగర్ ప్రభుత్వ పాఠశాలలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించినారు.

ఈసందర్భంగా సిరిసిల్ల డిఎస్పీ డీఎస్పీ నాగేంద్రచారి మాట్లాడుతూ...తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాదకద్రవ్యాల దుర్వినియోగం,అక్రమ రవాణా వ్యతిరేక వారోత్సవాలలో భాగంగా జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నమన్నారు. డ్రగ్స్, గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా కుటుంబం, సమాజం, దేశ భవిష్యత్తుపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు . మాదకద్రవ్యాల వ్యసనం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, ప్రతి విద్యార్థి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటంతో పాటు ఇతరులను కూడా అప్రమత్తం చేయాలని పిలుపునిచ్చారు. సమాజంలో డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు .జిల్లాలో ఎవరైనా మాదకద్రవ్యాల వినియోగం లేదా విక్రయాలకు పాల్పడుతున్నట్లు తెలిసిన వెంటనే తెలంగాణ ఈగల్ ఫోర్స్ హెల్ప్‌లైన్ నంబర్ 8712671111 కు లేదా సమీప పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు.అనంతరం విద్యార్థులందరితో కలిసి డీఎస్పీ నాగేంద్రచారి ,పోలీస్ అధికారులు, సిబ్బంది, పాఠశాల అధ్యాపకులు డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్ఐ నాగరాజు, పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.




# విద్యార్థులు, యువత డ్రగ్స్ లాంటి దూరలావాట్లకు దూరంగా ఉండాలి

## ఇల్లంతకుంట ఎస్ ఐ సిరిసిల్ల అశోక్

బలగం, టీవీ ఇల్లంతకుంట

విద్యార్థులు, యువకులు చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఇల్లంతకుంట ఎస్ ఐ సిరిసిల్ల అశోక్ అన్నారు. ఇల్లంతకుంట మండలంలోని రహీంఖాన్పేట్ గ్రామంలో ఆదర్శ పాఠశాలలో నా కోటింగ్ డ్రగ్స్ నివారణ కార్యక్రమాన్ని ఇల్లంతకుంట ఎస్సై సిరిసిల్ల అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ డ్రగ్స్ వాడడం వల్ల కలిగే దుష్పరిణామాలను విద్యార్థులకు తెలియజేశారు ఎక్కువగా 16 సంవత్సరాలు పైబడిన విద్యార్థులు, యువత ఈ డ్రగ్స్ బారిన పడుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులను డ్రగ్స్ కు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ఎవరైనా చుట్టుపక్కల డ్రగ్స్ తీసుకున్నట్లు అనుమానం వస్తే 1908కు కాల్ చేసి తెలియజేయాలన్నారు. అదేవిధంగా విద్యార్థులు మెయిల్ ద్వారా కూడా సమాచారం ఇవ్వవచ్చని,అలా ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని అయన తెలియజేశారు.డ్రగ్స్ నివారణపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రహీంఖాన్పేట్ గ్రామ సర్పంచ్ కముటం లావణ్య రాములు, ప్రిన్సిపల్ గంగాధర్ ఉపాధ్యాయులు, వార్డ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు పాటించని పానీ పూరి విక్రయ కేంద్రాలపై చర్యల..

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

ఆహార భద్రత నిబంధనలు పాటించని పలు పానీ పూరి విక్రయ కేంద్రాలపై అధికారులు చర్యలు తీసుకున్నారు. కేసు నమోదు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు, సిరిసిల్ల వేములవాడ పట్టణాల్లో రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, వైద్య శాఖ అధికారులు, ఆహార భద్రతా అధికారి సంయుక్తంగా పానీపూరి విక్రయ దుకాణాల్లో ఇటీవల తనిఖీ చేశారు. సిరిసిల్లలోని కైలాస్ పానీ పూరి, శివ్ కైలాస్ బేల్, అలాగే వేములవాడ లోని అనిల్ పానీ పూరి, శ్రీ బాలాజీ చాట్ భండార్, శ్రీ లక్ష్మీ చాట్ భండార్, సాయి చాట్ భండార్, దేవీ నారాయణ చాట్ భండార్, శ్రీ లక్ష్మీ చాట్ భండార్ లో తనిఖీ చేయగా, అపరిశుభ్రమైన పరిసరాల్లో తయారు చేసిన పానీ పూరీలు, పప్పు, పరిశుభ్రంగా లేని నీరు, ఉల్లిగడ్డలు, ఆలు గడ్డలు అధికారులు గుర్తించారు.ఆహార పదార్థాల తయారీ లో పాటించాల్సిన జాగ్రత్తలు నియమాలపై అవగాహన కల్పించారు. పని సమయంలో తప్పనిసరిగా ఆప్రాన్లు, హెయిర్ క్యాప్స్ ధరించాలని వారికి ఆదేశాలు జారీ చేశారు. సరైన ఆహార భద్రత ప్రమాణాలు పాటించని ఆయా దుకాణాల యజమానులపై కేసులు నమోదు చేశారు.జిల్లాలోని అన్ని ఆహార పదార్థాల విక్రయ దుకాణాల్లో నిరంతరం ఆకస్మిక తనిఖీ చేస్తామని, నిబంధనలు పాటించని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

# రంగారెడ్డి రైజర్స్ శుభారంభం..



## నల్గొండ నైట్స్‌పై 5 వికెట్ల విజయం

బలగం టీవి, హైదరాబాద్

టీజీ20 లీగ్–2026లో రంగారెడ్డి రైజర్స్ విజయంతో శుభారంభం చేసింది. ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా సోమవారం జరిగిన రెండో మ్యాచ్‌లో నల్గొండ నైట్స్‌పై 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. కెప్టెన్ తనయ్ త్యాగరాజన్ అద్భుత బ్యాటింగ్‌తో జట్టుకు విజయాన్ని అందించాడు.

టాస్ గెలిచిన రంగారెడ్డి రైజర్స్ కెప్టెన్ తనయ్ త్యాగరాజన్ ముందుగా బౌలింగ్ ఎంచుకోగా, బ్యాటింగ్‌కు దిగిన నల్గొండ నైట్స్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్లు గౌరవ్ రెడ్డి డకౌట్ కాగా, ప్రణవ్ సూర్యదేవర 7 పరుగులకే వెనుదిరిగాడు. వన్‌డౌన్ బ్యాటర్ పాట్యూరి నితీశ్ రెడ్డి 20 పరుగులు చేయగా, కెప్టెన్ రాహుల్ 19 బంతుల్లో 30 పరుగులతో జట్టుకు ఊపు తీసుకొచ్చాడు. వరుణ్ గౌడ్ 26 పరుగులు సాధించాడు. మధ్య ఓవర్లలో దివేశ్ సింగ్ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అతడు 27 బంతుల్లో ఐదు ఫోర్లు, ఒక సిక్సర్ సాయంతో 48 పరుగులు చేశాడు. చివర్లో వికెట్ కీపర్ హర్షవర్ధన్ సింగ్ కేవలం 20 బంతుల్లో ఐదు ఫోర్లు, ఒక సిక్సర్‌తో అజేయంగా 40 పరుగులు చేసి జట్టుకు భారీ స్కోరు అందించాడు. ఫలితంగా నల్గొండ నైట్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 189 పరుగులు చేసింది.రంగారెడ్డి బౌలర్లలో భువనగిరి పున్నయ్య మూడు వికెట్లు తీసి రాణించగా, నితిన్ సాయి యాదవ్, ఆర్యన్ కరియప్ప చెరో రెండు వికెట్లు పడగొట్టారు. కెప్టెన్ తనయ్ త్యాగరాజన్ ఒక వికెట్ దక్కించుకున్నాడు.

190 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన రంగారెడ్డి రైజర్స్ దూకుడుగా ఆడింది. ఆదిత్య జవ్వాజి 32 బంతుల్లో 41 పరుగులు చేసి మంచి ఆరంభం అందించాడు. అవినాష్ రావు కేవలం ఆరు బంతుల్లో 22 పరుగులు చేసి మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు.అయితే కెప్టెన్ తనయ్ త్యాగరాజన్ మ్యాచ్ హీరోగా నిలిచాడు. అతడు కేవలం 30 బంతుల్లో ఏడు ఫోర్లు, ఐదు సిక్సర్లతో అజేయంగా 71 పరుగులు చేసి ప్రత్యర్థి బౌలర్లపై పూర్తిగా ఆధిపత్యం చెలాయించాడు. చివర్లో నితిన్ సాయి యాదవ్ తొమ్మిది బంతుల్లో 26 పరుగులు చేసి విజయాన్ని ఖాయం చేశాడు.

ఫలితంగా రంగారెడ్డి రైజర్స్ 16.3 ఓవర్లలోనే 5 వికెట్లు కోల్పోయి 190 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. నల్గొండ బౌలర్లలో అనికేత్ రెడ్డి, వరుణ్ గౌడ్ చెరో రెండు వికెట్లు తీయగా, నిశాంత్ ఒక వికెట్ దక్కించుకున్నాడు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమష్టిగా రాణించిన రంగారెడ్డి రైజర్స్ టీజీ20 లీగ్–2026లో విజయంతో ఖాతా తెరిచింది.

# ఫిఫా వరల్డ్‌కప్‌లో ఈజిప్ట్ చరిత్ర..



## 92 ఏళ్ల నిరీక్షణకు తెర

బలగం టీవి, హైదరాబాద్

ఫిఫా వరల్డ్‌కప్–2026లో ఈజిప్ట్ చరిత్ర సృష్టించింది. గ్రూప్–జీలో భాగంగా న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 3–1 గోల్స్ తేడాతో విజయం సాధించిన ఈజిప్ట్, ప్రపంచకప్ చరిత్రలో తొలి విజయాన్ని నమోదు చేసింది. దీంతో ఈజిప్ట్ అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. 1934లో తొలిసారిగా ఫిఫా వరల్డ్‌కప్‌లో అడుగుపెట్టిన ఈజిప్ట్, గత 92 ఏళ్లలో ఒక్క విజయాన్ని కూడా నమోదు చేయలేకపోయింది. అయితే తాజా మ్యాచ్‌లో జికో, మహ్మద్ సలాహ్, ట్రెజెగెట్ గోల్స్‌తో చిరకాల నిరీక్షణకు తెరపడింది. ఈ విజయం ఈజిప్ట్ ఫుట్‌బాల్ చరిత్రలో ప్రత్యేక మైలురాయిగా నిలిచింది.వాంకోవర్‌లోని బీసీ ప్లేస్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. సర్‌ప్రీత్ సింగ్, ఎలిజా జస్ట్ గోల్స్ కోసం ప్రయత్నించినప్పటికీ ఈజిప్ట్ రక్షణ విభాగం అడ్డుకుంది. అయితే 15వ నిమిషంలో కార్నర్ నుంచి వచ్చిన బంతిని ఫిన్ సుర్మాన్ గోల్‌గా మలిచి న్యూజిలాండ్‌కు ఆధిక్యం అందించాడు. ఆ తర్వాత ఈజిప్ట్ సమం చేసేందుకు ప్రయత్నించినప్పటికీ తొలిభాగం ముగిసే సమయానికి అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఫలితంగా తొలి భాగం ముగిసే సమయానికి న్యూజిలాండ్ 1–0తో ఆధిక్యంలో నిలిచింది.

రెండోభాగంలో ఈజిప్ట్ అద్భుతంగా పుంజుకుంది. 58వ నిమిషంలో జికో హెడర్ ద్వారా గోల్ చేసి స్కోరును సమం చేశాడు. అనంతరం 67వ నిమిషంలో స్టార్ ఆటగాడు మహ్మద్ సలాహ్ గోల్ సాధించి ఈజిప్ట్‌కు ఆధిక్యం అందించాడు. ఆట ముగియడానికి ఎనిమిది నిమిషాలు మిగిలి ఉండగా ట్రెజెగెట్ మూడో గోల్ నమోదు చేసి జట్టు విజయాన్ని ఖరారు చేశాడు. ఈ విజయంతో ఈజిప్ట్ గ్రూప్–జీ పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది. రెండు మ్యాచ్‌లలో ఒక విజయం, ఒక డ్రాతో నాలుగు పాయింట్లు సాధించిన ఈజిప్ట్ నాకౌట్ దశకు చేరువైంది. మరోవైపు న్యూజిలాండ్ ఒక పాయింట్‌తో నాలుగో స్థానంలో నిలిచింది. ఇరాన్, బెల్జియం జట్లు చెరో రెండు పాయింట్లతో రెండో, మూడో స్థానాల్లో కొనసాగుతున్నాయి.

# ఇంగ్లండ్, ఐర్లాండ్ జట్ల ప్రకటన





బలగం టీవి, హైదరాబాద్

అఫ్గానిస్థాన్‌పై వన్డే సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన భారత జట్టు ఇప్పుడు విదేశీ పర్యటనలకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో టీమిండియాతో జరిగే టీ20 సిరీస్‌ల కోసం ఇంగ్లండ్, ఐర్లాండ్ క్రికెట్ బోర్డులు సోమవారం తమ జట్లను ప్రకటించాయి.

జూన్ 26 నుంచి ఐర్లాండ్‌తో రెండు టీ20ల సిరీస్ ఆడనున్న భారత్, అనంతరం జూలై 1 నుంచి ఇంగ్లండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో తలపడనుంది. ఈ నేపథ్యంలో ఇరు దేశాల క్రికెట్ బోర్డులు తమ జట్లను ప్రకటించాయి. ఐర్లాండ్ జట్టుకు లొర్కాన్ టక్నర్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా, 14 మంది సభ్యులతో కూడిన జట్టును ఐర్లాండ్ క్రికెట్ బోర్డు ప్రకటించింది. మరోవైపు ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు హ్యారీ బ్రూక్ నాయకత్వంలో 17 మంది సభ్యులతో కూడిన జట్టును ఎంపిక చేసింది. ఇంగ్లండ్ జట్టులో ఓపెనర్ బెన్ డకెట్‌కు చోటు దక్కలేదు. సకీబ్ మహమూద్, జోర్డన్ కాక్స్, సోనీ బేకర్ తిరిగి జట్టులోకి రాగా, జేమ్స్ కొలెస్ తొలిసారి టీ20 జట్టులో స్థానం సంపాదించాడు.

భారత్–ఐర్లాండ్ మధ్య తొలి టీ20 మ్యాచ్ జూన్ 26న జరగనుండగా, రెండో మ్యాచ్ జూన్ 28న నిర్వహించనున్నారు. అనంతరం జూలై 1 నుంచి భారత్–ఇంగ్లండ్ జట్ల మధ్య ఐదు టీ20ల సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్ అనంతరం ఇరు జట్లు వన్డే సిరీస్‌లో కూడా తలపడనున్నాయి. ఇక భారత జట్టుకు శ్రేయస్ అయ్యర్ సారథ్యం వహించనున్నట్లు సమాచారం. తిలక్ వర్మ ఉప కెప్టెన్‌గా వ్యవహరించనుండగా, యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీతో పాటు ఐపీఎల్‌లో రాణించిన పేసర్ ప్రిన్స్ యాదవ్‌లకు జట్టులో చోటు దక్కింది.

ఇంగ్లండ్ టీ20 జట్టు:లిలి హ్యారీ బ్రూక్ (కెప్టెన్), జోస్ బట్లర్, ఫిల్ సాల్ట్, టామ్ బ్యాంటన్, జాకబ్ బెథెల్, సామ్ కరన్, విల్ జాక్స్, లియామ్ డాసన్, జోష్ టంగ్, ల్యూక్ వుడ్, సకీబ్ మహమూద్, రెహాన్ అహ్మద్, జేమ్స్ కొలెస్, ఆదిల్ రషీద్, జోఫ్రా ఆర్చర్, సోనీ బేకర్, జోర్డన్ కాక్స్.

ఐర్లాండ్ టీ20 జట్టు:లిలి లొర్కాన్ టక్నర్ (కెప్టెన్), స్టీఫెన్ డొహెనీ, జై మూండ్రా, రాస్ అడైర్, మాథ్యూ హంఫ్రెస్, హ్యారీ టెక్టర్, బెన్ కాలిట్జ్, గవిన్ హోయ్, టిమ్ టెక్టర్, గరెత్ డెలానీ, మాథ్యూ హెలార్డ్, రూబెన్ విల్సన్, జార్జ్ డాక్రెల్, లియామ్ మెక్‌కార్తీ.

# లాకర్‌రూమ్‌లో భావోద్వేగ లేఖ.. ఇరాన్ ఆటగాళ్ల సందేశం వైరల్


బలగం టీవి, హైదరాబాద్

ఫిఫా ప్రపంచకప్‌లో ఇరాన్ జట్టు ఎదుర్కొంటున్న ఇబ్బందులు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. వీసా పరిమితులు, ప్రయాణ ఆంక్షల మధ్య టోర్నీలో పోటీ పడుతున్న ఇరాన్ ఆటగాళ్లు తాజాగా లాస్ ఏంజెలెస్‌లో జరిగిన మ్యాచ్ అనంతరం లాకర్‌రూమ్‌లో ఓ భావోద్వేగ లేఖను వదిలి వెళ్లడం ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారితీసింది.

గ్రూప్ దశలో భాగంగా బెల్జియంతో సోఫీ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఇరాన్ 0–0తో డ్రా చేసుకుంది. అంతకుముందు న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌ను 2–2తో సమం చేసిన ఇరాన్, వరుసగా రెండో డ్రాతో టోర్నీలో తన నాకౌట్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. అయితే మ్యాచ్ అనంతరం ఇరాన్ ఆటగాళ్లు లాకర్‌రూమ్‌లో రాసి వదిలిన లేఖ అందరినీ భావోద్వేగానికి గురి చేసింది. "ప్రాచీన పర్షియా నుంచి నేటి ఇరాన్ వరకు మా ప్రజల వ్యక్తిత్వం మారలేదు. ఈ టోర్నీలో లాస్ ఏంజెలెస్‌కు వచ్చి గౌరవంగా పోటీ పడ్డాం. గర్వంగా ఇక్కడి నుంచి వెళ్తున్నాం. మాకు ఆతిథ్యం అందించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. మాకు అండగా నిలిచిన అభిమానులకు కృతజ్ఞతలు. ప్రపంచ దేశాల మధ్య శాంతి, స్నేహం నెలకొనాలి" అని ఆ లేఖలో పేర్కొన్నారు.

ఈ లేఖలో #168, #minab హ్యాష్‌ట్యాగ్‌లను ప్రస్తావించడం కూడా చర్చనీయాంశమైంది. ఇరాన్‌లో జరిగిన కొన్ని సంఘటనలను సూచించే ఈ హ్యాష్‌ట్యాగ్‌లు సామాజిక, రాజకీయ భావోద్వేగాలను ప్రతిబింబిస్తున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. టోర్నీ మొత్తం ఇరాన్ జట్టు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. అమెరికా వీసా పరిమితుల కారణంగా కొంతమంది ఆటగాళ్లు, సిబ్బందికి ప్రవేశ అనుమతులు లభించలేదు. దీంతో జట్టు మెక్సికోలోని టిజువానాను కేంద్రంగా చేసుకుని ప్రతి మ్యాచ్‌కు అమెరికాకు ప్రయాణిస్తోంది. మ్యాచ్ ముగిసిన వెంటనే తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.






ఈ పరిస్థితులపై ఇరాన్ కోచ్ కూడా అసంతృప్తి వ్యక్తం చేశాడు. టోర్నీలో అత్యంత ఒత్తిడిని ఎదుర్కొంటున్న జట్టు తమదేనని పేర్కొన్నాడు. అయినప్పటికీ ఆటగాళ్లు ధైర్యంగా పోరాడుతూ జట్టును ముందుకు నడిపిస్తున్నారని వెల్లడించాడు. గ్రూప్ దశలో ఇప్పటివరకు రెండు మ్యాచ్‌ల్లో రెండు పాయింట్లు సాధించిన ఇరాన్, చివరి లీగ్ మ్యాచ్‌లో ఈజిప్ట్‌తో తలపడనుంది. ఆ మ్యాచ్ ఫలితమే ఆ జట్టు నాకౌట్ అవకాశాలను నిర్ణయించనుంది.

# ఖమ్మం ఏసెస్ విజయం

బలగం టీవి, హైదరాబాద్

తెలంగాణ క్రికెట్ లీగ్ (టీజీ20–2026) తొలి మ్యాచ్ అభిమానులకు ఐపీఎల్‌ను తలపించే ఉత్కంఠను అందించింది. ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా ఆదివారం జరిగిన హైస్కోరింగ్ పోరులో అన్విత ఖమ్మం ఏసెస్ జట్టు 20 పరుగుల తేడాతో పాలమూరు స్ట్రైకర్స్‌పై విజయం సాధించింది. మ్యాచ్‌లో ఇరు జట్లు కలిపి ఏకంగా 454 పరుగులు నమోదు చేయడం విశేషం. మ్యాచ్ ప్రారంభానికి ముందు సంగీత కార్యక్రమాలు, బాణాసంచా ప్రదర్శనలు, ప్రత్యేక వేడుకలతో స్టేడియం సందడిగా మారింది. సంగీత దర్శకుడు థమన్ సంగీతం, లీగ్ ప్రమోటర్ విజయ్ దేవరకొండ తదితరుల సమక్షంలో తొలి సీజన్‌కు ఘనంగా తెరలేచింది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ లీగ్ నిర్వహిస్తున్నారు.

టాస్ గెలిచిన పాలమూరు స్ట్రైకర్స్ తొలుత బౌలింగ్ ఎంచుకోగా, బ్యాటింగ్‌కు దిగిన ఖమ్మం ఏసెస్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 237 పరుగుల భారీ స్కోరు సాధించింది. వఫీ కచ్చి 30 బంతుల్లో 60 పరుగులు చేయగా, హిమతేజ 24 బంతుల్లో ఏడు సిక్సర్లతో అజేయంగా 59 పరుగులు చేశాడు. సాయి కృష్ణారెడ్డి 32 బంతుల్లో 52 పరుగులు చేసి జట్టుకు బలమైన పునాది వేశాడు. 238 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన పాలమూరు స్ట్రైకర్స్‌కు ఓపెనర్ విఘ్నేష్ రెడ్డి అద్భుత ఆరంభం అందించాడు. అతడు కేవలం 31 బంతుల్లో ఎనిమిది ఫోర్లు, ఏడు సిక్సర్లతో 86 పరుగులు చేసి ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. చైతన్య 35 పరుగులతో సహకరించగా, తొలి ఆరు ఓవర్లలోనే జట్టు వికెట్ నష్టపోకుండా 85 పరుగులు చేసింది. జట్టు స్కోరు 119 పరుగుల వద్ద విఘ్నేష్ రెడ్డి ఔటవడంతో మ్యాచ్ మలుపు తిరిగింది. అనంతరం కెప్టెన్ ప్రజ్ఞారెడ్డి (15), చైతన్య వరుసగా వెనుదిరగడంతో రన్‌రేట్‌పై ప్రభావం పడింది. చివరి నాలుగు ఓవర్లలో 58 పరుగులు అవసరమైన దశలో ఖమ్మం బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి ప్రత్యర్థిని నియంత్రించారు. రోహిత్ రాయుడు అజేయంగా 26 పరుగులు చేసినప్పటికీ, పాలమూరు స్ట్రైకర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 217 పరుగులకే పరిమితమైంది. ఖమ్మం ఏసెస్ బౌలర్లలో వేద్ రెడ్డి రెండు వికెట్లు తీయగా, విద్యానంద్ రెడ్డి ఒక వికెట్ పడగొట్టాడు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమష్టిగా రాణించిన ఖమ్మం ఏసెస్ టీజీ20 లీగ్‌లో విజయంతో ఖాతా తెరిచింది.

# కెప్టెన్‌గా విఫలమయ్యా.. సెమీస్ కల నెరవేరలేదు

## చమరి ఆటపట్టు

బలగం టీవి, హైదరాబాద్



మహిళల టీ20 ప్రపంచకప్‌లో మరోసారి శ్రీలంక జట్టు నిరాశపరిచింది. టోర్నీ చరిత్రలో ఇప్పటివరకు ఒక్కసారి కూడా సెమీఫైనల్‌కు చేరని శ్రీలంక, ఈసారి కూడా లీగ్ దశలోనే నిష్క్రమించే పరిస్థితి ఎదుర్కొంటోంది. జట్టు వైఫల్యంపై శ్రీలంక కెప్టెన్ చమరి ఆటపట్టు తీవ్ర నిరాశ వ్యక్తం చేసింది.వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో ఓటమి అనంతరం మాట్లాడిన చమరి ఆటపట్టు, కెప్టెన్‌గా తాను విఫలమయ్యానని ఆవేదన వ్యక్తం చేసింది. జట్టును సెమీఫైనల్‌కు చేర్చాలన్న తన కల నెరవేరలేదని పేర్కొంది.ఇంగ్లండ్ వేదికగా జరుగుతున్న మహిళల టీ20 ప్రపంచకప్‌లో శ్రీలంక ఇప్పటివరకు మూడు మ్యాచ్‌లు ఆడి ఒక్క విజయమే నమోదు చేసింది. గ్రూప్–2లో ఐదో స్థానంలో ఉన్న లంక జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించే పరిస్థితిలో ఉంది. ఈ సందర్భంగా చమరి మాట్లాడుతూ.. "నేను 18 సంవత్సరాలుగా దేశం తరఫున ఆడుతున్నాను. ఇది నా పదో టీ20 ప్రపంచకప్. అయినప్పటికీ జట్టును సెమీఫైనల్‌కు తీసుకెళ్లే అవకాశాన్ని అందిపుచ్చుకోలేకపోయాను. వ్యక్తిగతంగా ఎన్నో విజయాలు సాధించినా, కెప్టెన్‌గా మాత్రం విఫలమయ్యాననే బాధ కలుగుతోంది" అని పేర్కొంది. వెస్టిండీస్‌పై మరింత బాధ్యతగా ఆడాల్సిందని, తాను క్రీజులో నిలబడి ఉంటే జట్టును విజయానికి చేర్చేవాళ్లమని ఆమె అభిప్రాయపడింది. జట్టు ఓటమికి ఎవరినీ బాధ్యులను చేయనని, ఆటగాడిగా, కెప్టెన్‌గా తనపై బాధ్యత ఎక్కువగా ఉందని తెలిపింది. గ్రూప్ దశలోనే మరోసారి నిష్క్రమించే పరిస్థితి ఏర్పడడం ఎంతో బాధాకరమని, శ్రీలంకను సెమీస్‌కు చేర్చాలన్న తన చివరి అవకాశాన్ని కోల్పోయినట్లుగా అనిపిస్తోందని చమరి భావోద్వేగానికి గురైంది. గ్రూప్–2లో శ్రీలంక తొలి మ్యాచ్‌లో ఇంగ్లండ్ చేతిలో 87 పరుగుల తేడాతో ఓడిపోయింది. అనంతరం న్యూజిలాండ్‌పై ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించినా, వెస్టిండీస్ చేతిలో పరాజయం పాలైంది. మిగిలిన లీగ్ మ్యాచ్‌లలో ఐర్లాండ్, స్కాట్లాండ్ జట్లతో శ్రీలంక తలపడనుంది.



# స్లో ఓవర్‌రేట్‌తో ఇంగ్లండ్‌కు భారీ షాక్..

## డబ్ల్యూటీసీలో 12 పాయింట్ల కోత

బలగం టీవి, హైదరాబాద్

కెన్నింగ్‌టన్ ఓవల్ టెస్టులో న్యూజిలాండ్ చేతిలో ఘోర పరాజయం పాలైన ఇంగ్లండ్ జట్టుకు మరో భారీ షాక్ తగిలింది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 2025–27 సైకిల్‌లో స్లో ఓవర్‌రేట్ కారణంగా ఆ జట్టుకు 12 పాయింట్ల కోత విధించారు. దీంతో ఇప్పటికే ఓటమి బాధలో ఉన్న ఇంగ్లండ్‌కు ఇది మరింత ఎదురుదెబ్బగా మారింది. స్వదేశంలో జరుగుతున్న మూడు టెస్టుల సిరీస్‌లో భాగంగా కెన్నింగ్‌టన్ ఓవల్‌లో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ 253 పరుగుల భారీ తేడాతో పరాజయం పాలైంది. మ్యాచ్ సందర్భంగా నిర్ణీత సమయంలో వేయాల్సిన ఓవర్లను పూర్తి చేయకపోవడంతో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) చర్యలు తీసుకుంది.

ఐసీసీ నిబంధనల ప్రకారం నిర్ణీత సమయానికి 12 ఓవర్లు తక్కువగా బౌలింగ్ చేసినందుకు మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ 12 పాయింట్ల కోత విధించారు. దీంతో డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో ఇంగ్లండ్ 38 పాయింట్లతో ఏడో స్థానానికి పడిపోయింది. పాయింట్ల కోతతో పాటు ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బందికి మ్యాచ్ ఫీజులో 50 శాతం జరిమానా విధించారు. దీంతో ఇంగ్లండ్ జట్టుకు ద్వంద్వ దెబ్బ తగిలినట్లైంది. ఇంగ్లండ్‌కు స్లో ఓవర్‌రేట్ కారణంగా పాయింట్ల కోత పడటం ఇదే తొలిసారి కాదు. 2023–25 డబ్ల్యూటీసీ సైకిల్‌లో కూడా ఆ జట్టు 19 పాయింట్లు కోల్పోయింది. అప్పట్లో కూడా ప్రత్యర్థి న్యూజిలాండ్ జట్టే కావడం విశేషం. ఆ సమయంలో ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ ఐసీసీ నిర్ణయంపై వ్యంగ్యంగా స్పందించాడు. 'ఐసీసీకి అభినందనలు.. ఇంకా పది గంటల ఆట మిగిలి ఉండగానే మ్యాచ్ ముగిసింది' అంటూ సామాజిక మాధ్యమాల్లో వ్యాఖ్యానించాడు. ఇంతకుముందు 2021లో బ్రిస్బేన్ టెస్టు అనంతరం ఇంగ్లండ్ ఎనిమిది పాయింట్లు, 2022లో ట్రెంట్ బ్రిడ్జ్ టెస్టు తర్వాత మరో రెండు పాయింట్లు కోల్పోయింది. వరుసగా స్లో ఓవర్‌రేట్ సమస్యలు ఇంగ్లండ్ జట్టుకు తలనొప్పిగా మారుతున్నాయి.

# టెస్టుల్లో రీఎంట్రీపై విరాట్ క్లారిటీ..

బలగం టీవి, హైదరాబాద్



భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ టెస్టు క్రికెట్‌లోకి తిరిగి వస్తాడనే ఊహాగానాలకు స్వయంగా ఆయన తెరదించాడు. టెస్టు ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన అనంతరం కొంతకాలంగా రీఎంట్రీపై వార్తలు వినిపిస్తున్న నేపథ్యంలో కోహ్లీ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

ఢిల్లీలో తన సొంత బ్రాండ్ 'వన్8' స్పోర్ట్స్‌వేర్ స్టోర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కోహ్లీకి టెస్టు క్రికెట్‌లోకి తిరిగి వచ్చే అవకాశాలపై ప్రశ్న ఎదురైంది. కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించిన డానిష్ సైత్ సరదాగా ప్రశ్నిస్తూ.. "మీ టెస్టు పరుగుల సంఖ్య 9,230. అదే ధరతో ఒక షఉ కూడా ఉంది. ఇంకొన్ని టెస్టులు ఆడి పరుగులు పెంచి ఆ షఉ విలువను కూడా పెంచాలని అనుకుంటున్నారా?" అని అడిగాడు. దీనికి విరాట్ కోహ్లీ కూడా చమత్కారంగా స్పందిస్తూ.. "అమ్మకాలు తక్కువైనా ఫర్వాలేదు. టెస్టు క్రికెట్‌తో నా పని అయిపోయింది. ఆ అధ్యాయం అప్పుడే ముగిసిపోయింది" అని స్పష్టం చేశాడు. దీంతో టెస్టు క్రికెట్‌లోకి తిరిగి వచ్చే అవకాశాలపై వస్తున్న ప్రచారానికి ఆయన ముగింపు పలికినట్లయింది.

గత ఏడాది మే నెలలో టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికిన కోహ్లీ 14 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో 123 టెస్టు మ్యాచ్‌లు ఆడి 9,230 పరుగులు సాధించాడు. ఇందులో 30 సెంచరీలు, 31 అర్ధ సెంచరీలు ఉన్నాయి. అతని అత్యధిక వ్యక్తిగత స్కోరు అజేయ 254 పరుగులు. భారత టెస్టు చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో కోహ్లీ నాలుగో స్థానంలో నిలిచాడు. 2016 నుంచి 2019 మధ్య కాలంలో కోహ్లీ టెస్టు క్రికెట్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు. ఆ నాలుగేళ్లలో 43 టెస్టుల్లో 4,208 పరుగులు సాధించి ప్రపంచ క్రికెట్‌లో తన ఆధిపత్యాన్ని చాటుకున్నాడు. కెప్టెన్‌గా ఏడు డబుల్ సెంచరీలు నమోదు చేసి అరుదైన రికార్డును సృష్టించాడు. ఈ సందర్భంగా తన క్రికెట్ ప్రయాణాన్ని గుర్తు చేసుకున్న కోహ్లీ, ఢిల్లీతో తనకు ఉన్న అనుబంధాన్ని వివరించాడు. "నా జీవితంలో అన్నీ ఢిల్లీలోనే ప్రారంభమయ్యాయి. ఇక్కడే పుట్టాను.. ఇక్కడే క్రికెట్ ఆడటం మొదలుపెట్టాను. అందుకే వన్8 బ్రాండ్‌ను ఢిల్లీలో ప్రారంభించడం నాకు ఎంతో ప్రత్యేకం. అభిమానుల ప్రేమ, మద్దతు వల్లే ఈ స్థాయికి చేరుకున్నాను" అని పేర్కొన్నాడు.

# 'మెగా 158' కొత్త షెడ్యూల్ ప్రారంభం






**బలగం టీవీ, హైదరాబాద్**

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'మెగా 158' కొత్త షుటింగ్ షెడ్యూల్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. భారీ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం చిత్రీకరణ దశలో వేగంగా సాగుతోంది.తాజా షెడ్యూల్ ప్రారంభమైన సందర్భంగా చిత్ర యూనిట్ ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. ఈ షెడ్యూల్‌ను 'ఎక్స్‌ప్లోజివ్'గా, 'మరపురాని అనుభూతి'గా చిత్ర బృందం అభివర్ణించింది. విడుదలైన వీడియోలో చిరంజీవితో పాటు ఇతర నటీనటులు పచ్చళ్ల తయారీ నేపథ్యంతో రూపొందించిన సెట్లో చిత్రీకరణలో పాల్గొంటున్న దృశ్యాలు కనిపించాయి.ఈ షెడ్యూల్‌లో అనస్వర రాజన్, నివేదా పేతురాజ్‌తో పాటు పలువురు నటీనటులు పాల్గొంటున్నారు. ఇటీవల తమిళనాడులోని పొల్లాచ్చిలో నిర్వహించిన కీలక షెడ్యూల్‌ను పూర్తి చేసిన చిత్ర బృందం, ప్రస్తుతం హైదరాబాద్‌లో తదుపరి షెడ్యూల్‌ను కొనసాగిస్తోంది. ఈ చిత్రాన్ని చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కెరీర్‌లో మరో మైలురాయిగా నిలిచేలా రూపొందిస్తున్నట్లు మేకర్స్ ఇప్పటికే వెల్లడించారు. 'బ్లడీ బెంచ్‌మార్క్' అనే ట్యాగ్‌లైన్‌తో ప్రచారం పొందుతున్న ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. చిత్రానికి సంగీతాన్ని ఎస్. థమన్ అందిస్తుండగా, కేవీఎన్ ప్రొడక్షన్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, అప్‌డేట్లు సినీ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి.

# 25న 'ఎన్‌బీకే 112' గ్రాండ్ లాంచ్

### ముఖ్య అతిథిగా నారా లోకేష్

**బలగం టీవీ, హైదరాబాద్**

నందమూరి నటసింహం బాలకృష్ణ, స్టార్ దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'ఎన్‌బీకే 112' ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. జూన్ 25న విజయవాడ సమీపంలోని వెంకటపాలెం టీటీడీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో చిత్ర ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఐ అండ్ పీఆర్ శాఖ మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. చిత్ర తొలి షాట్‌కు ఆయన క్లాప్ కొట్టనుండగా, మంత్రి కందుల దుర్గేష్ కూడా వేడుకలో పాల్గొననున్నారు. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రం ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

బాలకృష్ణ, కొరటాల శివ తొలిసారి కలిసి పనిచేస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రంలో బాలకృష్ణను శక్తివంతమైన పాత్రలో కొరటాల శివ ఆవిష్కరించనున్నట్లు సమాచారం. 'మిర్చి', 'శ్రీమంతుడు', 'జనతా గ్యారేజ్', 'దేవర' వంటి విజయవంతమైన చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కొరటాల శివ, బాలకృష్ణ కోసం బలమైన కథను సిద్ధం చేసినట్లు సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. బాలకృష్ణ మాస్ ఇమేజ్‌కు అనుగుణంగా యాక్షన్ అంశాలతో పాటు సామాజిక సందేశాన్ని కూడా సినిమాలో మేళవించనున్నట్లు తెలుస్తోంది. విజయవాడలో ఈ ప్రారంభోత్సవాన్ని నిర్వహించడం, నారా లోకేష్ ముఖ్య అతిథిగా హాజరుకావడం వల్ల ఈ కార్యక్రమానికి రాజకీయ ప్రాధాన్యత కూడా ఏర్పడింది. బాలకృష్ణ అల్లుడైన లోకేష్ తొలి షాట్‌కు క్లాప్ కొట్టడం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, ఈ చిత్రం ఓ బలమైన సామాజిక నేపథ్యంతో కూడిన కథాంశంతో రూపొందనుంది. సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడే పాత్రలో బాలకృష్ణ కనిపించనున్నట్లు టాక్ వినిపిస్తోంది.




చిత్రానికి సంబంధించిన హీరోయిన్, సంగీత దర్శకుడు, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను జూన్ 25న జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమంలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్న నేపథ్యంలో, బాలకృష్ణ కెరీర్‌లో అత్యంత భారీ ఓపెనింగ్ సాధించే చిత్రాల్లో 'ఎన్‌బీకే 112' ఒకటిగా నిలుస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# 'వెంకీఅనిల్5' పేరుతో నకిలీ కాస్టింగ్ కాల్స్..

## అప్రమత్తంగా ఉండాలని చిత్ర బృందం హెచ్చరిక




**బలగం టీవీ, హైదరాబాద్**

టాలీవుడ్‌లో విజయవంతమైన కాంబినేషన్లలో ఒకటైన విక్టరీ వెంకటేష్, దర్శకుడు అనిల్ రావిపూడి జోడీ మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రస్తుతం '#VenkyAnil5' వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్న నేపథ్యంలో, సినిమా పేరుతో సోషల్ మీడియాలో నకిలీ కాస్టింగ్ కాల్స్ నిర్వహిస్తున్నట్లు వెలుగులోకి రావడంతో చిత్ర బృందం అప్రమత్తం చేసింది.సినీ రంగంలో అవకాశాల కోసం ఎదురుచూస్తున్న యువతను లక్ష్యంగా చేసుకుని కొందరు వ్యక్తులు '#VenkyAnil5' సినిమా పేరుతో తప్పుడు కాస్టింగ్ ప్రకటనలు ప్రచారం చేస్తున్నట్లు చిత్ర యూనిట్ గుర్తించింది. కొందరు తాము చిత్ర బృందానికి చెందినవారమని చెప్పుకుంటూ ఆడిషన్ల పేరుతో వ్యక్తిగత వివరాలు సేకరించడం, డబ్బులు డిమాండ్ చేయడం జరుగుతోందని సమాచారం.దీనిపై స్పందించిన నిర్మాతలు అధికారిక ప్రకటన విడుదల చేశారు. సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్న కాస్టింగ్ కాల్స్‌కు తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. సినిమా పేరును దుర్వినియోగం చేస్తూ కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఈ కాస్టింగ్ ప్రకటనలు పూర్తిగా నకిలీవని వెల్లడించారు.సినిమాల్లో అవకాశాల పేరుతో ఎవరూ తమ వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, పత్రాలు లేదా ఇతర సమాచారం తెలియని వ్యక్తులకు అందించవద్దని చిత్ర బృందం సూచించింది. అలాగే కాస్టింగ్, ఆడిషన్ల పేరుతో ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే అప్రమత్తం కావాలని హెచ్చరించింది.చిత్ర బృందం ఎలాంటి కాస్టింగ్ ప్రక్రియలోనూ డబ్బులు వసూలు చేయదని స్పష్టం చేసింది. మోసగాళ్ల మాటలు నమ్మకుండా, అధికారిక సమాచారం కోసం మాత్రమే వేచి ఉండాలని యువతకు విజ్ఞప్తి చేసింది.

భవిష్యత్తులో ఈ చిత్రానికి సంబంధించి కాస్టింగ్ అవసరాలు ఉంటే, వాటికి సంబంధించిన వివరాలు అధికారిక సోషల్ మీడియా ఖాతాలు, నిర్మాణ సంస్థల ప్రకటనల ద్వారానే వెల్లడిస్తామని నిర్మాతలు తెలిపారు. అధికారికంగా ధృవీకరించని ఎలాంటి సమాచారం లేదా ప్రకటనలను నమ్మవద్దని సూచించారు.వెంకటేష్, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపొందుతున్న ఐదో చిత్రం కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. ఈ చిత్రంలో నందమూరి కళ్యాణ్ రామ్ కీలక పాత్రలో నటించనున్నట్లు సమాచారం. కీర్తి సురేష్, కృతి శెట్టి కథానాయికలుగా కనిపించనున్నారు.

# ఆగస్టు 26న 'టాక్సిక్' విడుదల..






### అధికారికంగా ప్రకటించిన మేకర్స్

**బలగం టీవీ, హైదరాబాద్**

రాకింగ్ స్టార్ యశ్ నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'టాక్సిక్' విడుదల తేదీని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. పలుమార్లు వాయిదా పడిన ఈ చిత్రాన్ని ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఆదివారం వెల్లడించారు.ఫాదర్స్ డే సందర్భంగా సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో చిత్ర విడుదల తేదీని ప్రకటిస్తూ 'హానర్ థై ఫాదర్' (నీ తండ్రిని గౌరవించు) అనే క్యాప్షన్‌ను జత చేశారు. దీంతో యశ్ అభిమానుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. తొలుత ఈ చిత్రాన్ని మార్చి 19న విడుదల చేయాలని భావించినప్పటికీ, చిత్రీకరణ ఆలస్యం కారణంగా విడుదల తేదీని జూన్ 4కు మార్చారు. అనంతరం అంతర్జాతీయ స్థాయిలో పంపిణీ, భాగస్వామ్య ఒప్పందాల కారణంగా మరోసారి వాయిదా వేశారు. ప్రపంచవ్యాప్తంగా ఒకే రోజు చిత్రాన్ని విడుదల చేసే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని చిత్ర బృందం గతంలో తెలిపింది. అంతర్జాతీయ ప్రేక్షకులను ఆకట్టుకునే స్థాయి ఈ చిత్రానికి ఉందని, ప్రేక్షకుల అంచనాలకు అనుగుణంగా అత్యుత్తమ నాణ్యతతో సినిమాను అందించేందుకు అదనపు సమయం తీసుకున్నట్లు పేర్కొంది.

ఎట్టకేలకు కొత్త విడుదల తేదీని ప్రకటించడంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. అయితే గతంలో పలుమార్లు వాయిదా పడిన నేపథ్యంలో ఈసారి ప్రకటించిన తేదీకే సినిమా విడుదలవుతుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న 'టాక్సిక్' చిత్రంపై ఇప్పటికే సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. యశ్ నటన, గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం, పాన్ ఇండియా స్థాయిలో విడుదల వంటి అంశాలు ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

### 'ది ప్యారడైజ్' విడుదలపై సందిగ్ధం..

# మళ్లీ వాయిదా పడేనా?




**బలగం టీవీ, హైదరాబాద్**

నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్ ఇండియా చిత్రం 'ది ప్యారడైజ్'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, గ్లింప్స్‌లు సినిమాపై ఆసక్తిని పెంచగా, తాజాగా ఈ సినిమా విడుదల మళ్లీ వాయిదా పడే అవకాశాలు ఉన్నాయన్న ప్రచారం సినీ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

ఆగస్టు 21న చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు గతంలో చిత్ర బృందం ప్రకటించినప్పటికీ, తాజాగా విడుదలైన విక్రమ్ మాలిక్ గ్లింప్స్‌లో విడుదల తేదీని ప్రస్తావించకపోవడం చర్చనీయాంశంగా మారింది. సినిమాలో ప్రతినాయక పాత్రలో నటిస్తున్న రాఘవ్ జుయాల్ పాత్రను పరిచయం చేస్తూ విడుదల చేసిన ఈ గ్లింప్స్‌లో ఎక్కడా రిలీజ్ డేట్ లేకపోవడంతో సినిమా వాయిదా పడే అవకాశాలపై ఊహాగానాలు మరింత బలపడ్డాయి. సినిమాకు సంబంధించి ఇంకా దాదాపు 30 రోజుల చిత్రీకరణ మిగిలి ఉన్నట్లు సమాచారం. అనంతరం పోస్ట్ ప్రొడక్షన్ పనులకు కూడా సమయం అవసరమవుతుందని తెలుస్తోంది. దీంతో ఆగస్టులో సినిమా విడుదల కష్టమేనని, డిసెంబర్‌కు వాయిదా పడే అవకాశాలు ఉన్నాయని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై చిత్ర నిర్మాణ సంస్థ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

వాస్తవానికి ఈ చిత్రాన్ని తొలుత 2026 మార్చి 26న విడుదల చేయాలని చిత్ర బృందం ప్రకటించింది. అయితే షుటింగ్ ఆలస్యం కారణంగా విడుదల తేదీని ఆగస్టుకు మార్చారు. ఇప్పుడు మరోసారి విడుదల వాయిదా పడే అవకాశాలు ఉన్నాయన్న వార్తలు అభిమానులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇదిలా ఉండగా, సినిమా మేకింగ్ విషయంలో దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ఎలాంటి రాజీకి వెళ్లరని హీరో నాని పలు సందర్భాల్లో వెల్లడించారు. ప్రతి సన్నివేశాన్ని అత్యుత్తమంగా తెరకెక్కించేందుకు చిత్ర బృందం కృషి చేస్తోందని తెలిపారు. అయితే సినిమా విడుదల మరింత ఆలస్యమైతే అభిమానులకు నిరాశ తప్పదని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# చిరంజీవితో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు భేటీ..



### రాజకీయ వర్గాల్లో చర్చ

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవిని భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీకి సంబంధించిన చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో రాజకీయ, సినీ వర్గాల్లో విస్తృత చర్చకు దారితీసింది.

బీజేపీ వర్గాల సమాచారం ప్రకారం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా 'మహాజన్ సంపర్క్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ఆర్థిక సంస్కరణల వివరాలను వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు తెలియజేస్తున్నారు. అందులో భాగంగానే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు చిరంజీవిని కలిసి కేంద్ర ప్రభుత్వ పనితీరుకు సంబంధించిన పుస్తకాలు, ప్రచార పత్రాలను అందజేసినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా దేశ అభివృద్ధి, ఆర్థిక ప్రగతి, సామాజిక రంగాల్లో చోటుచేసుకున్న మార్పులపై చర్చ జరిగినట్లు సమాచారం.అధికారికంగా ఈ సమావేశాన్ని మర్యాదపూర్వక భేటీగానే పేర్కొన్నప్పటికీ, రాజకీయ వర్గాల్లో పలు విశ్లేషణలు కొనసాగుతున్నాయి. గతంలో ప్రజారాజ్యం పార్టీని స్థాపించి రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన చిరంజీవి, అనంతరం ఆ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసి కేంద్ర మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. అనంతరం రాజకీయాలకు దూరంగా ఉంటూ సినీ రంగంపైనే దృష్టి సారించారు.ఇదిలా ఉండగా, జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రస్తుతం ఎన్డీయే కూటమిలో కీలక భాగస్వామిగా కొనసాగుతున్నారు. బీజేపీతో జనసేనకు ఉన్న రాజకీయ సంబంధాల నేపథ్యంలో చిరంజీవి–రామచందర్ రావు భేటీకి మరింత ప్రాధాన్యత ఏర్పడింది. అయితే ఈ సమావేశం కేవలం మర్యాదపూర్వకంగానే జరిగిందా? లేక భవిష్యత్ రాజకీయ పరిణామాలకు సంకేతమా? అన్నది ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# 'మా ఇంటి బంగారం'కు బాక్సాఫీస్‌లో జోరు..

### మూడు రోజుల్లో రూ.43 కోట్ల గ్రాస్

**బలగం టీవీ, హైదరాబాద్**



టాలీవుడ్ స్టార్ నటి సమంత ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రం బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా దూసుకెళ్తోంది. విడుదలైన తొలి మూడు రోజుల్లోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.43 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించినట్లు చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. ముఖ్యంగా ఆదివారం సెలవు దినం కావడంతో థియేటర్లలో ప్రేక్షకుల సందడి పెరిగి, వసూళ్లు గణనీయంగా పెరిగాయి. దీంతో ఈ చిత్రం త్వరలోనే రూ.50 కోట్ల గ్రాస్ మార్కును అధిగమించే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.ల ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద పెద్ద చిత్రాల పోటీ లేకపోవడం 'మా ఇంటి బంగారం'కు కలిసి వస్తోంది. తెలుగు రాష్ట్రాల్లోని పలు కేంద్రాల్లో ప్రేక్షకులు థియేటర్లకు భారీగా తరలివస్తుండగా, అడ్వాన్స్ బుకింగ్స్ కూడా ఆశాజనకంగా కొనసాగుతున్నాయి. దీంతో తొలి వారం ముగిసే నాటికి సినిమా మరింత భారీ వసూళ్లు నమోదు చేసే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్ మార్కెట్‌లోనూ ఈ చిత్రం మంచి స్పందనను అందుకుంటోంది. ముఖ్యంగా ఉత్తర అమెరికా మార్కెట్‌లో 'మా ఇంటి బంగారం' చిత్రం ఇప్పటికే 1.3 మిలియన్ డాలర్ల వసూళ్లకు చేరువైనట్లు సమాచారం. దర్శకురాలు నందిని రెడ్డి తెరకెక్కించిన ఈ చిత్రంలో సమంతతో పాటు శ్రీముఖి, గుల్షన్ దేవయ్య, గౌతమి తదితరులు కీలక పాత్రలు పోషించారు. కుటుంబ భావోద్వేగాలు, వినోదాత్మక అంశాలతో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటోందని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి.

# పెళ్లి పీటలెక్కిన షణ్ముఖ్ జశ్వంత్..

**బలగం టీవీ, హైదరాబాద్**



బిగ్‌బాస్ ఫేమ్, ప్రముఖ యూట్యూబర్ షణ్ముఖ్ జశ్వంత్ తన అభిమానులకు శుభవార్త చెప్పాడు. ఇటీవల తన ప్రేయసి వైష్ణవి చోడిశెట్టితో నిశ్చితార్థం చేసుకున్న షణ్ముఖ్, తాజాగా కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో వివాహ బంధంలోకి అడుగుపెట్టాడు. ఎలాంటి ఆర్భాటం లేకుండా రాజమండ్రికి చెందిన వైష్ణవిని వివాహం చేసుకున్న షణ్ముఖ్‌కు సంబంధించిన పెళ్లి ఫొటోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. పెళ్లి వేడుకలో ఈ జంట ఆనందంగా కనిపించగా, అభిమానులు, నెటిజన్లు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.పెళ్లి చిత్రాలను చూసిన అభిమానులు 'మేడ్ ఫర్ ఈచ్ అదర్', 'క్యూట్ కపుల్' అంటూ కామెంట్లు చేస్తున్నారు. వైష్ణవి కూడా సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా గుర్తింపు పొందినట్లు సమాచారం. ప్రస్తుతం వీరిద్దరి పెళ్లి ఫొటోలు నెట్టింట విస్తృతంగా చక్కర్లు కొడుతున్నాయి.బిగ్‌బాస్ తెలుగు సీజన్–5లో పాల్గొన్న షణ్ముఖ్ జశ్వంత్ ఆ సీజన్‌లో బలమైన పోటీదారుడిగా నిలిచాడు. యూట్యూబ్‌లో ఇప్పటికే భారీ ఫాలోయింగ్ సంపాదించుకున్న ఆయన టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగినా, చివరకు రన్నరప్‌గా నిలిచాడు.అయితే బిగ్‌బాస్ హౌస్‌లో జరిగిన కొన్ని పరిణామాలు ఆయన వ్యక్తిగత జీవితంపై ప్రభావం చూపాయి. ముఖ్యంగా సహ కంటెస్టెంట్ సిరి హనుమంత్‌తో ఆయన స్నేహం అప్పట్లో పెద్ద చర్చకు దారి తీసింది. షోకు ముందు యూట్యూబర్ దీప్తి సునయనతో ప్రేమలో ఉన్న షణ్ముఖ్, బిగ్‌బాస్ అనంతరం వ్యక్తిగత కారణాలతో ఆమెతో విడిపోయాడు. ఈ బ్రేకప్ అప్పట్లో సోషల్ మీడియాలో సంచలనంగా మారింది. తదనంతరం పలు వివాదాల కారణంగా వార్తల్లో నిలిచిన షణ్ముఖ్, ప్రస్తుతం తన కెరీర్‌పై దృష్టి సారించాడు. వెబ్ సిరీస్‌లు, డిజిటల్ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న ఆయన, ఇప్పుడు వైష్ణవిని వివాహం చేసుకుని తన వ్యక్తిగత జీవితంలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టాడు.